PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 106 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 13 ఏప్రిల్ 2026

### ఆర్‌జికే అంబెడ్కర్ సెంటర్లో మహానుభావులకు పూల మాలలు



3లో

### ఇంటర్ పాసైన విద్యార్థులకు రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్




3లో

# హోర్ముజ్‌ను దిగ్బంధించండి

**- అమెరికా నావిక దళానికి ట్రంప్ ఆదేశాలు**



**వాషింగ్టన్ ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇరాన్‌తో చర్చలు విఫలమైన వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా2లో...

# రాజకీయ లబ్ధికే...

### ఆదరాబాదరగా సమావేశాలపై ప్రధానికి మల్లికార్జున్ ఖర్గే లేఖ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆదరాబాదరాగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నించ డాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యగా కనిపిస్తోందన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఖర్గే లేఖ రాశారు. మిగతా2లో...

# ఇంటర్‌లో బాలికలదే హవా

**ప్రతిభ చాటిన ప్రభుత్వ విద్యాసంస్థలు**

**ఫలితాలు విడుదల చేసిన కె.కేశవరావు**

**ఫస్టియర్‌లో 66.20 శాతం, సెకండియర్‌లో 75.34 శాతం**

**రెండేండ్ల ఉత్తీర్ణత శాతం 70.60**

**మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఈసారి బాలికలే పైచేయి సాధించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు సత్తా చాటాయి. 16 రకాల యాజమాన్యాల పరిధిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా, అత్యధికంగా 94.03 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు మొదటిస్థానంలో నిలిచాయి. కాంపోజిట్ యాజమాన్యంలోని విద్యార్థుల్లో ఉత్తీర్ణత 36.71 శాతంతో అతి తక్కువగా ఉంది.మేనేజ్‌మెంట్ల వారీగా చూస్తే టీజీఎస్ఆర్టీసీ 89.29, సోషల్ వెల్ఫేర్ 86.79, సెంట్రల్ గవర్నమెంట్ 86, టీఎస్ గవర్నమెంట్ స్పోర్ట్స్ 84.85, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 84.46, ట్రైబల్ వెల్ఫేర్ 84.20, బీసీ వెల్ఫేర్ 83.48, కేజీబీవీ 81.39, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 71.57, మోడల్ స్కూల్స్ 66.15, ఇన్సెంటివ్ 65.70, గవర్నమెంట్ 59.86, ప్రయివేట్ ఎయిడెడ్ 55.78, కో ఆపరేటివ్ కళాశాలలు 52.43 శాతాలతో ఉత్తీర్ణత సాధించాయి. మిగతా2లో...

# దేశంలో సమగ్ర కుల జనగణన జరగాలి

**● అప్పుడే సామాజిక న్యాయం సాధ్యం**

**:డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జాతీయ స్థాయిలో సమగ్ర కుల జనగణన జరిగితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు, మిగతా2లో...

# మహిళా బిల్లుకు మద్దతివ్వండి

### - ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహిళా రిజర్వేషన్ చట్ట (నారీ శక్తి వందన్ అధినియమ్) సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో నిర్వహిద్దామని తెలిపారు. 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో నిర్వహించడం అనివార్యమని లేఖలో ప్రధాని పేర్కొన్నారు. మహిళలు, మిగతా2లో...

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్

- పేరు మార్పుపై పరిశీలన చేస్తున్నాం : కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర
- పార్టీకి, ప్రజల మధ్య గ్యాప్ వల్లే గత ఎన్నికల్లో ఓడాం
- ఆ నలుగురు సీఎంలు బాగా పాలించారు



2లో

# ఎండ ప్రచండ

**ఉదయం 9 గంటలకే భగ్గుమంటున్న సూర్యుడు**

**రాష్ట్రంలో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు**

**ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం**



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతోంది. గత వారం రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పలు జిల్లాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు ఎండ తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఎండ తీవ్రతకు తోడు వేడి, ఉక్కపోత అధికంగా ఉండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం జిల్లాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలీవిధంగా ఉన్నాయి. ఆదిలాబాద్ (40.3 డిగ్రీలు), భద్రాచలం (39.6 డిగ్రీలు), హన్మకొండ (37.5 డిగ్రీలు), హైద రాబాద్ (39.4 డిగ్రీలు), ఖమ్మం (39.8 డిగ్రీలు), మహబూబ్‌నగర్ (40.5 డిగ్రీలు), మెదక్ (39.9 డిగ్రీలు), నల్గొండ (37.8 డిగ్రీలు), నిజామాబాద్ (40.7 డిగ్రీలు), రామగుండం (39.0 డిగ్రీలు), హయత్‌నగర్ (37.6 డిగ్రీలు), పటాన్‌చెరు (38.0 డిగ్రీలు), రాజేంద్రనగర్ (38.5 డిగ్రీలు) మేర మిగతా2లో...



# అల్విదా ఆశా

**92 ఏండ్ల వయసులో చికిత్సపొందుతూ కన్నుమూత**

**ప్రధాని, రాష్ట్రపతి సహా పలువురి సంతాపం**

**ముంబయి ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతీయ సంగీత చరిత్రలో అత్యంత ప్రసిద్ధి చెందిన గాత్రాల్లో ఒకటైన ప్రముఖ నేపథ్య గాయని ఆశా భోస్లే ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో కన్నుమూశారు. గుండెపోటు, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆమెను శనివారం ఆస్పత్రిలో చేర్చారు. ఆమె వయస్సు 92 ఏండ్లు. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ చెల్లెలైన ఆశా భోస్లే ఎనిమిది దశాబ్దాలకు పైగా విస్తరించిన సంగీత వారసత్వాన్ని వదిలి వెళ్లారు. మహారాష్ట్రలోని సాంగ్లీలో 1933, సెప్టెంబర్ 8న జన్మించిన ఆమె, ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు పండిట్ దీనానాథ్ మంగేష్కర్ కుమార్తె. ఆమె తండ్రి మరణించినప్పుడు, ఆమెకు కేవలం తొమ్మిదేండ్లు. కుటుంబాన్ని పోషించడానికి ఆమె తన సోదరితో పాటు సినిమాల్లో పాడటం, నటించడం ప్రారంభించారు. ఆమె 1943లో మరాఠీ మిగతా2లో...

### కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణకు

# వారంలో డిజైన్లు

- పునరుద్ధరణ పనుల వేగవంతానికి స్టీరింగ్ కమిటీ కమిటీకి కన్వీనర్‌గా ఇరిగేషన్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా
- 2028 నాటికి మరమ్మతుల ప్రక్రియ పూర్తి ఎల్‌అండ్‌టీ సహా సంస్థలన్నీ తమ పనులను తక్షణమే పునరుద్ధరించాలి
- కాళేశ్వరంపై ప్రత్యేక సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం



2లో

# ఇంటర్‌లో బాలికలదే హవా

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనూ దాదాపు ఇదే రకమైన ఫలితాలు ఆయా యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాతో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద బాయి, సీజీజీ డైరెక్టర్ జనరల్ రవి గుప్తా పాల్గొన్నారు. **బాలికలదే పైచేయి** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జనరల్ విద్యార్థులు 71.12 శాతం, వొకేషనల్‌లో 65.65 శాతం మొత్తం 70.60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 66.20 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75.34 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 74.40 శాతం, బాలురు 57.69 శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 68.08 శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 82.07 శాతంతో పైచేయి సాధించారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థుల్లో మొదటి సంవత్సరం 66.91 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది 66.94 శాతానికి పెరిగింది. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలోనూ 71.43 శాతం నుంచి 75.61 శాతానికి చేరింది. వొకేషనల్ ఉత్తీర్ణతా శాతం మొదటి సం.లో 57.69 శాతం నుంచి 59.30 శాతానికి, రెండో సంవత్సరంలో 67.45 శాతం నుంచి 71.15 శాతానికి పెరిగింది. జిల్లాల వారీగా చూస్తే మొదటి సంవత్సరంలో మేడ్చల్ మల్కాజిగిరి 77.02, రంగారెడ్డి 75.69, జయశంకర్ భూపాలపల్లి 72.19 శాతంతో మొదటి మూడు స్థానాల్లో నిలవగా, రాజన్న సిరిసిల్ల 51.38, కామారెడ్డి 49.88, మహబూబాబాద్ 48.1 శాతంతో చివరి మూడు స్థనల్లో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో జయశంకర్ భూపాలపల్లి 81.95, ములుగు 81.68, కొమరం భీమ్ (ఆసిఫాబాద్) 80.57 శాతంతో మొదటి మూడు స్థానాల్లో ఉండగా, కామారెడ్డి 59.56, వరంగల్ 58.76, రాజన్న సిరిసిల్ల 55.68 శాతంతో పూర్తిగా వెనుకబడ్డాయి. గ్రూప్‌ల వారీగా ఫలితాలను విశ్లేషిస్తే మొదటి సంవత్సరం ఎంపీసీలో 75.51, ద్వితీయ సంవత్సరంలో 78.01 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారు. హెచ్‌ఈసీ మొదటి సంవత్సరంలో కేవలం 34.34 శాతం, ద్వితీయ సంవత్సరంలో 49.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 9,70,075 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి సంవత్సరంలో 4,89,123 మంది పరీక్ష రాయగా 3,23,807 మంది, రెండో సంవత్సరంలో 5,07,948 మందికి 3,58, 490 మంది ఉత్తీర్ణులయ్యారు. **20 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ గడువు మే 13 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు** ఇంటర్ పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం సోమవారం (ఏప్రిల్ 13వ తేదీ) నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తు, ఫీజు చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు. మే 13 నుంచి ప్రారంభం కానున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. మే 22న అడ్వాన్స్‌డ్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయి. రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలుగా నెల రోజుల్లోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వంచనున్నారు. ఇంటర్ ఫలితాలను ఈ సారి వాట్సాప్ ద్వారా చూసుకునే వెసులుబాటు కల్పించారు. **నేను థర్డ్ క్లాస్‌లో పాసయ్యా...: ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు** తాను థర్డ్ క్లాస్‌లో పాస్ అయ్యానని, అయినా స్టేట్ ర్యాంకర్ శ్రీదేవసేనతో సమానమైన నాలెడ్జ్ తనకుందని కె.కేశవరావు ఈ సందర్భంగా తెలిపారు. పుస్తకంలో ఉన్నదే పూర్తి జ్ఞానం కాదనీ, బయట ప్రపంచాన్ని కూడా అర్థం చేసుకోవడమే పూర్తి నాలెడ్జ్ అని చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిల్ కావడ మంటే చదువురాని వారు కాదన్నారు. విద్యావ్యవస్థలో మార్పులు తేవాల్సిన అవసరముందన్నారు. పాఠశాలలనేవి సమాజాన్ని అర్థం చేసుకునేవిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. 5 నిమిషాలు ఆలస్యమైతే పరీక్షకు అనుమతించకపోవడం లాంటివి పిల్లల్లో భయాన్ని పెంచుతాయని వ్యాఖ్యానిం చారు. వారిలో భయం పోగొట్టేందుకు విద్యావ్యవస్థలో మార్పులు రావాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, వెంటనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నామనీ, బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ మెరుగైనదనేందుకు ఇంటర్ ఫలితాలే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్

**నస్పూర్,ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్)** :బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్ పార్టీగా పేరు మార్పు చేసే అంశాన్ని పరిశీలన చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ముగిసిన తరువాత కొంతమంది మీడియా సభ్యులతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు కీలకవ్యాఖ్యలు చేశారు. పార్టీ పేరు మార్పు గురించి ఆలోచన తమ పరిశీలనలో ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీ పేరు మార్చాక కొంత నష్టపోయిన మాట వాస్తవం అన్నారు. మళ్లీ పాత పార్టీ పేరు గురించి చర్చ జరుగుతోందన్నారు. ఇటీవల కవిత తాను పెట్టబోయే పార్టీకి టీఆర్ఎస్ పేరు పెడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో కేటీఆర్ పార్టీ పేరు మార్పు గురించి మీడియాతో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇంకా అనేక విషయాలను కేటీఆర్ వివరించారు.

గతంలో తాము చేసిన చిన్నచిన్న తప్పుల వల్ల పార్టీకి, ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ అన్నారు. జరిగిన తప్పులపై అద్యయనం చేశామని, లోపాలను సరిదిద్దుకుంటామని తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని, కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్‌తో తెలంగాణలో 179 అసెంబ్లీ సీట్లు, 28 పార్లమెంటు స్థానాలు పెరుగుతాయని, అందరికీ టికెట్లు లభిస్తాయని అన్నారు. పొత్తులకు తమకు కలిసిరాదని, కుదరదని అన్నారు. బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదన్నారు. తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీకి సిద్ధమని, ఇక్కడ పోటీ చేయాలని ఏమీ లేదన్నారు. ప్రజా సమస్యలపై 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేయబోతున్నట్టు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలన చేశారని, వారిలో ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ అని చెప్పారు. **కవిత విషయంలో చెప్పేదేమీ లేదు** కవిత విషయంలో చెప్పేదేమీ లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పిల్లలు తండ్రిని సంతోషపెట్టకపోయినా పర్వాలేదు కానీ ఏడిపించొద్దు అని అన్నారు. రాజకీయం ఉంటుంది.. పోతుంది.. కానీ, ఇతరులను బాధపెట్టే తీరు మంచిది కాదు అని సూచించారు. రాజకీయ పార్టీ ఎవరైనా పెట్టుకోవచ్చుని, దానికి ప్రజల ఆదరణ ముఖ్యమని తెలిపారు. **దోచుకొని దాచుకోవడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యం : కేటీఆర్** రాష్ట్రాన్ని దోచుకొని దాచుకోవడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యంగా పనిచేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో పర్యటనలో భాగంగా నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు.

# ఎండ ప్రచండ

(మొదటి పేజీ తరువాయి)

ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతు న్నారు. ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. శుక్రవారం నాటికే రాష్ట్రంలోని 27 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరగనున్న నేపథ్యం లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ కీలక సూచనలు చేసింది. మధ్యా హ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని హితవు పలికింది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారుల విష యంలో మరింత జాగ్రత్త అవస రమని సూచించింది. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే వడదెబ్బ తగలకుండా తలపాగా, గొడుగు వంటివి వాడా లని, తరచూ నీరు, ద్రవ పదార్థా లు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# అల్విదా ఆశా

(మొదటి పేజీ తరువాయి)

చిత్రం 'మార్ఘూ బాల్'తో సినీ రంగ ప్రవేశం చేసి, 1948లో 'చునరియా' చిత్రంతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టారు. ఎనిమిది దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో, ఆమె పలు భాషల్లో 12,500 కు పైగా పాటలను రికార్డ్ చేశారు.వాటిలో 'అభీ నా జావో చోడ్ కర్', 'ఇన్ ఆంఖోం కీ మస్తీ', 'పియా తు అబ్ తో ఆజా' వంటి కాలాతీతమైన గీతాలు ఈనాటికీ అభిమానుల ఆదరణ పొందుతున్నాయి. ఆమె శాస్త్రీయ సంగీతం, గజల్, భజన్, పాప్, ఖవ్వాలీల్లో ప్రావీణ్యం ప్రదర్శించారు. హిందీతో పాటు 20కి పైగా భాషలకు తన గాత్రాన్ని అందించారు. సంగీత దర్శకులు ఓ.పి. నయ్యర్, సచిన్ దేవ్ బర్మన్, ఆర్‌డీ బర్మన్‌లతో ఆమె గాత్రం చేసిన కృషి భారతీయ చిత్రసీమలో చిరస్థాయిగా నిలిచిపోయిన కొన్ని పాటలను అందించింది. 2011లో ప్రపంచంలోనే అత్యధిక పాటలను రికార్డ్ చేసిన కళాకారిణిగా ఆమె గుర్తింపు పొందారు. 79 ఏండ్ల వయసులో.. 2013లో వచ్చిన 'మై' చిత్రంలో కథానాయికగా ఆమె తన నటనా జీవితాన్ని ప్రారంభించారు. ఆమె అందుకున్న గౌరవాల్లో 1981లో 'ఉమ్రావ్ జాన్', 1987లో 'ఇజాజత్' చిత్రాలకు ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా రెండు జాతీయ పురస్కారాలు, 2000లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, 2008లో పద్మవిభూషణ్, జీవిత సాఫల్య పురస్కారంతో సహా తొమ్మిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, రెండు గ్రామీ నామినేషన్‌లు ఉన్నాయి.**ఆశా భోస్లే మరణం పట్ల సీఎం దిగ్భ్రాంతి** పద్మ విభూషణ్, జాతీయ పురస్కార గ్రహీత, గాయని ఆశాభోస్లే మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతీయ సంగీతానికి చేసిన అనితరసాధ్యమైన సేవలు, భాషా భేదం లేకుండా తన గానంతో ఆమె ప్రజలను అలరించిన తీరు, తరతరాలకు ప్రేరణనిచ్చే వారసత్వాన్ని అందించారని పేర్కొన్నారు. ఆమె మరణంతో దేశ సాంస్కృతిక, కళారంగానికి తీరని లోటు ఏర్పడిందని చెప్పారు. ఆశా భోస్లే కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి ముఖ్యమంత్రి సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోశారు. ఆశాభోస్లే మరణం పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణకు వారంలో డిజైన్లు



**హైదరాబాద్,ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్)** : కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు గాను నీటిపారుదల రంగ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమై ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తుందని అన్నారు. అవసరమైతే స్వయంగా తానే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షించనున్నట్లు వెల్లడించారు. ఈ పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు గాను సంబంధిత అధికారులతో ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్య దాస్‌నాథ్, జాయింట్ సెక్రటరీ కే.శ్రీనివాస్, టన్నెల్ నిపుణులు పరిక్షిత్ మెహ్రా, ఇ.ఎన్.సిలు రమేష్ బాబు, శ్రీనివాస్‌లతో పాటు సి.డబ్ల్యూ.పి.ఆర్.ఎస్ ఆదనపు డైరెక్టర్ సెల్వా బాలన్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ), విజిలెన్స్ కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ మూడు నిర్మాణాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయని అన్నారు. 2028 నాటికి మరమ్మతుల ప్రక్రియ పూర్తి కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతుల పూర్తి ప్రక్రియలో భాగంగా 2027, 2028 సంవత్సరాలను కీలకంగా పరిగణించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని, అదే సమయంలో మేడిగడ్డలో కొంత భాగన్నీ పూర్తి చేయగలమనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎఫ్‌ఆర్‌వై ఇండియా, ఐఐటి ముంబయిలకు కొత్త డిజైన్ల బాధ్యతను అప్పగిస్తూ ప్రభుత్వం ఇప్పటికే డిజైన్ కన్సల్టెంట్‌గా ఎఫ్‌ఆర్‌వై ఇండియాను ఎంపిక చేసి, ఐఐటి ముంబయితో సంయుక్తంగా పని చేయాలని నిర్ణయించిందని మంత్రి పేర్కొన్నారు. డిజైన్ బృందం రాత్రింబవళ్లు పనిచేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. డిజైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, డిజైన్ సిద్ధమైన వెంటనే సెంట్రల్ వాటర్ కమిషన్ ఆమోదానికి పంపాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. సెక్రటరీ పరిక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపులో ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కన్సల్టెంట్లకు ఆయన సూచించారు.

# హోర్ముజ్‌ను దిగ్బంధించండి

(మొదటి పేజీ తరువాయి)

"హర్మూజ్‌ను దిగ్బంధించాలని మా దేశ నౌకాదళాన్ని ఆదేశించాం. జలసంధిలోకి నౌకలు ప్రవేశించకుండా లేదా నిష్క్రమించకుండా అమెరికా నౌకలు అడ్డుకోవడం మొదలుపెడతాయి. అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు సుంకం చెల్లించిన ప్రతి నౌకను వెంబడిస్తాం. చట్టవిరుద్ధమైన టోల్ చెల్లింపులు జరిపినా ఎవరికీ అంతర్జాతీయ సముద్రాలపై సురక్షితమైన ప్రయాణం ఉండదు. సరైన సమయంలో ఇరాన్‌ను అంతం చేయడానికి సిద్ధంగా ఉన్నాం." అని పేర్కొన్నారు. హోర్ముజ్‌ను తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసినా, మాటతప్పిందన్నారు. ఇరాన్ చర్యలతో అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. జలసంధిని వెంటనే తెరవాలని అన్నారు. చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ అణుశక్తి విషయంలో అంగీకారం కుదరలేదని ట్రంప్ పేర్కొన్నారు. అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే చర్చలు బెడిసికొట్టాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వనని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన నాశనమైందని... గగనతల రక్షణ, రాడార్ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. ఖమేని సహా అనేకమంది ఇరాన్ నేతలు మరణించారని, ఇదంతా వారి అణ్వాయుధాల ఆశయం వల్లేనని తెలిపారు. హర్మూజ్ దిగ్బంధనం త్వరలో ప్రారంభమవుతుందని, ఇందులో ఇతర దేశాలు కూడా భాగస్వాములవుతాయని అన్నారు. చట్టవిరుద్ధంగా ఇరాన్ ప్రయోజనం పొందడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అన్నారు.**నిర్మాణాత్మక చర్యలు సూచించినా.... : ఘలీబఫ్** చర్చల సమయంలో తమ విశ్వాసాన్ని పొందడంలో అమెరికా విఫలమైందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ వ్యాఖ్యానించారు. శాంతి చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధి బృందంలో ఆయన కూడా సభ్యుడిగా వ్యవహరించారు. 'ఇరాన్ ప్రతినిధి బృందంలోని నా సహచరులు 168 నిర్మాణాత్మక చర్యలు సూచించారు. చివరికి జరిగిందేమిటంటే ఇరాన్ ప్రతినిధి బృందం విశ్వాసాన్ని అమెరికా పొందలేకపోయింది' అని ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలిపారు. గత రెండు యుద్ధాల అనుభవాల దృష్ట్యా ఇరు పక్షాలు పరస్పర విశ్వాసాన్ని పొందలేకపోయాయని చెప్పారు. రెండు లేదా మూడు కీలక అంశాలు ఒప్పందానికి అవరోధంగా మారాయని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి తెలిపారు. కొన్ని అంశాలపై ఇరు పక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ ఇతర అంశాలపై అభిప్రాయబేధాలు నెలకొన్నాయని వివరించారు. 'దౌత్యం ఎన్నటికీ ముగియబోదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఒక్క సమావేశంలోనే ఒప్పందం కుదరదు కదా అని చెప్పారు. చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్‌తోనూ, ఇతర స్నేహితులతోనూ ఇరాన్ సంప్రదింపులు కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజకీయ లబ్ధికే...

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడించకుండా మళ్లీ తమ సహకారం కోరడం సరికాదని, ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశాలపై అర్థవంతమైన చర్చ జరగాలని ఖర్గే తెలిపారు. ఇందుకోసం 'నారీ శక్తి అభియాన్' 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మీకు తెలుసు. ఆ సమయంలో తక్షణం ఈ కీలక చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ తరపున నేను స్వయంగా కోరాను' అని ఖర్గే గుర్తు చేశారు.

నియోజక వర్గాల పునర్విభ జనకు సంబంధించిన వివరాలు వెల్లడించ కుండా విపక్షాల సహకారాన్ని కేంద్రం కోరుతోందని, డీలిమి టేషన్, ఇతర కీలకాంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని పేర్కొన్నారని, అయితే అది నిజం కాదని ఖర్గే తెలిపారు. 2026 ఏప్రిల్ 29 తరువాత ఎప్పుడైనా సరే రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు, అందరినీ ఏకతాటిపై ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించినదే అయితే నారీ శక్తి వందన్ అధినియమ్-2023 సవరణతో ముడిపడిన డీలిమిటేషన్‌పై చర్చ జరిపేందుకు ఏప్రిల్ 29 తరువాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఖర్గే సూచించారు.

# దేశంలో సమగ్ర కుల జనగణన జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్ జీ కిరణ్‌కుమార్, డాక్టర్ వాహినిబిల్లు రచించిన "క్యాస్ట్ సెన్సెస్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్" (కుల గణన, సామాజిక న్యాయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడం) అనే పుస్తకాన్ని ఆదివారంనాడిక్కడి ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే జనగణనలో అన్ని కులాల సామాజిక, విద్య, ఆర్థికస్థాయిల్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. పుస్తక రచయితలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిపాలనను బలోపేతం చేయడం, సామాజిక న్యాయాన్ని మరింత లోతుగా స్థాపించడంలో కుల లెక్కింపు ప్రాధాన్యతను ఈ గ్రంథం స్పష్టంగా ప్రతిపాదిస్తుందని తెలిపారు. అనంతరం డిప్యూటీ సీఎం బీసీ ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, మేధావులు, విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ అయ్యారు.కార్యక్రమంలో డి అశోక్, సురేందర్, గణేశ్, శివ, అరవింద్, లక్కీ, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుకు మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తు తరాల కోసం బాధ్యత తీసుకోవాలని పార్టీలను కోరారు. ఇందుకోసం పార్లమెంటులో చర్చను స్వాగతిస్తున్నామని చెప్పారు. 'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరినీ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. పార్లమెంటులో ఎక్కువమంది తమ అభిప్రాయాలను పంచుకోవడం అందరికీ గర్వకారణమవుతుంది. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని చాలాకాలంగా సభ్యులు కోరుతున్నారు. వారి ఆకాంక్షలు కార్యరూపంలోకి వచ్చే సమయం ఇప్పుడు వచ్చింది. 140 కోట్ల భారతీయులు, నారీశక్తి సాధించిన విజయం ఇది. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు అంతా కలిసికట్టుగా ముందుకు వస్తారనే పూర్తి నమ్మకం ఉంది' అని మోడీ లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా విజన్ సాకారం కావాలంటే ఈ ప్రయాణంలో మహిళలు కీలకమైన, చురుకైన పాత్ర పోషించడం అవసరమని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు లేఖలో ప్రధాని వివరించారు.**బిజెపి మూడు లైన్ల విప్ జారీ** ఈ నెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో తమ పార్టీ ఎంపిలకు బిజెపి మూడు లైన్ల విప్ జారీ చేసింది. ఎంపిలంతా ఈ సమావేశాల సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని, కేంద్ర మంత్రులతో సహా ఎంపిలంతా ఈ మూడు రోజులు సభలోనే ఉండాలని, ఎలాంటి సెలవులు మంజూరు చేసేదిలేదని, హాజరు కచ్చితంగా ఉండాలని విప్‌లో పేర్కొంది.**2011 జనాభా లెక్కల ఆధారంగానే రిజర్వేషన్ బిల్లు?** ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుపై దృష్టి పెట్టడం, రిజర్వేషన్ అమలు కాలపరిమితికి సంబంధించి కీలక సవరణలు చేసే అవకాశం ఉంది. జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని నారీశక్తి వందన్ అధినయం -- 2023 చెబుతోంది. జనగణనలో జాప్యం జరుగుతున్నందున 2011 జనాభా లెక్కల ఆధారంగానే ముందుకు వెళ్లాలని కేంద్రం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

# మహబూబాబాద్ జిల్లా డీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా డాక్టర్ కిరణ్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక

**మహబూబాబాద్, ప్రతినిధి ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి నూతన ఉత్సాహాన్ని నింపే విధంగా కీలక నిర్ణయం తీసుకోబడింది. జిల్లా డీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా డాక్టర్ కిరణ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పార్టీ వర్గాల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ నియామకం ద్వారా జిల్లా స్థాయిలో వైద్య వర్గాల సమన్వయం, సేవా కార్యక్రమాల విస్తరణకు మరింత ఊతం లభిస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు.డాక్టర్ కిరణ్ నాయక్ గతంలో కూడా పార్టీకి అనేక విధాలుగా సేవలందించి, ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందారు. వైద్య రంగంలో సేవలతో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రజాభిమానాన్ని సంపాదించారు. ఈ నేపథ్యంలో ఆయనను డాక్టర్ సెల్ చైర్మన్‌గా ఎన్నుకోవడం సముచిత నిర్ణయమని పలువురు నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ నాయక్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమా నాయక్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే, జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించడం, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపడతానని ఆయన వివరించారు. పార్టీ కార్యకర్తలతో సమన్వయం పెంచుతూ గ్రామస్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తానని తెలిపారు.అనంతరం పార్టీ ప్రముఖులతో సమావేశమైన డాక్టర్ కిరణ్ నాయక్, ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని, జిల్లా అభివృద్ధి మరియు ప్రజా సేవలే తన ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. ఆయన నాయకత్వంలో డాక్టర్ సెల్ మరింత చురుకుగా పనిచేస్తుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

- ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి
- ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, సెంటర్ ఇంచార్జి కక్కెర్ల అశోక్ గారి ఆధ్వర్యంలో.





**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి గారు ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, మరియు సెంటర్ ఇంచార్జి కక్కెర్ల అశోక్ గౌడ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గారు కొబ్బరికాయ కొట్టి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యానికి సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ కొనుగోలు కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.వరి ధాన్యం కొనుగోలు మద్దతు ధర క్వింటాకు గ్రేడ్ ఏ రకం 2389/-కామన్ రకానికి 2369/- అని తెలియజేశారు రైతులు దలార్ల మాటలు నమ్మి మోసపోవద్దు ప్రభుత్వం కేటాయించిన ఐ కే పి సెంటర్లలోనే ధాన్యం అమ్ముకోవాలని రైతులకు సూచన చేశారుఈ కార్యక్రమంలోములుగు మున్సిపల్ కౌన్సిలర్లు కేశెట్టి నవీన్, సిలువేరు సాంబయ్య,పొడాలా సుస్మిత కిరణ్,గ్రామ కమిటీ అధ్యక్షుడు నెల్లుట్ల రాజన్న, ఆలోత్ దేవేందర్, జంజీరాల దేవయ్య, పొడల కిషోర్, కుక్కల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. మరియు లక్ష్మి గణపతి రైతుమిత్ర సంఘం సభ్యులు, గ్రామ రైతులు, స్థానిక నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఆర్‌జికే అంబెడ్కర్ సెంటర్లో మహానుభావులకు పూల మాలలు



- బాబా సాహెబ్ రాజ్యాంగం లేకుంటే మనం ఎక్కడ?
- ముఖ్య అతిథి వసుమతి ప్రణిత శ్రీకాంత్ గౌడ్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఏప్రిల్ 12,(పిసిడబ్ల్యూ న్యూస్) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయి గూడ డివిజన్ లోని ఆర్జీకే అంబెడ్కర్ సెంటర్లో అంబెడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మహానుభావులకు పూల మాల కార్యక్రమం లో ఈ 12వ వారానికి ముఖ్య అతిథిగా వసుపతి ప్రణిత శ్రీకాంత్ గౌడ్ మాజీ చైర్మన్ దమ్మాయి గూడ మున్సిపల్ వచ్చి మహా నాయకులు డాక్టర్,, బి, ఆర్, అంబెడ్కర్, డాక్టర్, బాబు జాగ్జీవన్ రామ్ లకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈనాటి సభ కు అధ్యక్షులు వల్లి సురేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిధి వసుపతి ప్రణిత శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబెడ్కర్ రాజ్యాంగం లో హక్కులు కల్పించకుంటే ఈ రోజు మనం ఇలా ఉండే వారిమీ కాదు కాబట్టి మన హక్కుల గురించి ఎవరు చెప్పారు మన పిల్లలకు మనమే చెప్పాలి అన్నారు ఈ కార్యక్రమనికి మాకు ఆహ్వానం వచ్చినందుకు ధన్యవాదములు అన్నారు. అంబెడ్కర్ సంఘం అధ్యక్షులు డాక్టర్, గోల్లూరి రాజు సమక్షంలో సంఘం ఉపాధ్యక్షులు జ్యోతి, రూప లతో ప్రణిత శ్రీకాంత్ గౌడ్ లకు షాలవాలతో సన్మానం జరిగింది ఈ కార్యక్రమనికి ఈగ శ్వేత, గుజ్జుక పర్సురాం, పోతరాజు రాములు. సలహాదారులు స్వామి,జగన్ నాద్, ఎస్ సంపత్, జెల్లా నర్సింహా,గౌరవ అధ్యక్షులుమంగళపురి వెంకటేష్ మాజీ కౌన్సలర్. అధ్యక్షులు డాక్టర్,,గోల్లూరి రాజుఆర్గనైజింగ్ సెక్రెటరీనామది రాజా. సందీప్, జాయింట్ సెక్రటరీ గాదె రామకృష్ణ, కోశాధికారి గాలి సురేష్, ఉపాధ్యక్షులు పాడుగుల రూప, జ్యోతి, సాయి రెడ్డి,వర్కింగ్ ప్రసిడెంట్ పేరం ఎల్లయ్య, పాముల రంగయ్య,జిమ్ వెంకటేష్ కమిటీ సభ్యులు అజయ్, నాగరాజు, శ్రీనివాస్, డి నాగేశ్వరావు.అంబెడ్కర్ సంఘం దమ్మాయిగూడ అధ్యక్షులు బోడ నరేష్, బయ్యే గౌతమ్,పాడుగుల చంద్రమౌళి (స్వేరో )ఆర్ జి కె డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అంబేద్కర్ సంఘం సభ్యులు,డబుల్ బెడ్ రూమ్, ఆర్ జి కె కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పాసైన విద్యార్థులకు రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్




**హైదరాబాద్, ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పాస్ అయిన విద్యార్థులకు కంప్యూటర్ ఎడ్యుకేషన్ మెరిట్ స్కాలర్షిప్ ప్రోగ్రాం కింద వివిధ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సులు ఆన్ లైన్ లో నేర్చుకునేందుకు రూ.1లక్ష వరకు కోర్సు ఫీజులో రాయితీ ఇస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఇంటర్ మార్క్స్ గ్రేడింగ్ ఆధారంగా రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్ కు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ స్కాలర్ షిప్ ప్రోగ్రాం కొరకు అభ్యర్థులు ఆన్ లైన్ వెబ్ సైట్: www.nationalskillacademy.in ద్వారా ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9505800047.

# ఆదివాసి ఎరుకల కులస్తులను గుర్తించండి

- తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్
- ఏటూరు నాగారం మండల కమిటీ ఎన్నిక
- మండల అధ్యక్షులుగా జగన్నాథం రాంబాబు ఎన్నిక




**ఏటూరునాగారం,ఏప్రిల్ 12,(పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆదివాసీలకు చెందిన ఎరుకల కులస్తులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏటూరు నాగారం గిరిజన భవన్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న లోకిని రాజు మాట్లాడుతూ, ఎటూరు నాగారం ఐటిడిఏ పరిధిలో ఎరుకల కులస్తులకు ప్రభుత్వ పథకాల ఫలాలు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు.ఎరుకల కులస్తులు తట్టలు, బుట్టలు అల్లుతూ జీవనం సాగించే సంప్రదాయ వృత్తులతో బతుకుతున్నారని, వారు ఇంకా పేదరిక రేఖకు దిగువన ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని గుర్తించి ఆర్థిక, సామాజికంగా ఆదుకోవాలని కోరారు.అలాగే, మే 1న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామంజపురం గ్రామంలో నాంచారమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా ఈ జాతరకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని చెప్పారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సంఘం కృషి చేస్తుందని వివరించారు.రామానుజాపూర్ గ్రామ పరిధిలో కాకతీయుల కాలంలో నిర్మితమైన ఐదు శివలింగాలతో కూడిన పంచకూటాలయంగా ప్రసిద్ధి చెందిన నాంచారమ్మ ఆలయానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని తెలిపారు. అభివృద్ధి పేరుతో దెబ్బతిన్న ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా మని హామీ ఇచ్చారు. ఏటూరు నాగారం మండల కమిటీ ఎన్నికలు నిర్వహించగా, మండల అధ్యక్షులుగా జగన్నాథం రాంబాబు, గౌరవాధ్యక్షులుగా జగన్నాథం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం సాగర్, ఉపాధ్యక్షులుగా సాల్ల సాంబయ్య, కోశాధికారిగా కేతుల సారయ్య, సహాయ కార్యదర్శిగా రేవల్లి కిరణ్ ఎన్నికయ్యారు. మహిళ మండల అధ్యక్షురాలిగా శ్రీరాముల సారమ్మ, ప్రధాన కార్యదర్శిగా కేతిరి రజిత, ఉపాధ్యక్షురాలిగా కేతిరి స్వరూప, కోశాధికారిగా సుల్తాన్ సారమ్మ ఎంపిక య్యారు. జిల్లా అధ్యక్షులు కేతిరి బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లకొండ ఎల్లస్వామి, ఉపాధ్యక్షులు మేడ బంగారయ్య, సాల బాబు, హనుమకొండ జిల్లా ప్రతినిధులు మానుపాటి రమేష్, ఓనీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో అంబేద్కర్ జయంతి సభ పోస్టర్ విడుదల

- ఏప్రిల్ 14న సాయంత్రం 4 గంటలకు సభ
- విస్తృతంగా హాజరుకావాలని పిలుపు



**ఉప్పల్, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సభను ఈ నెల 14వ తేదీన ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను పార్టీ నాయకులు విడుదల చేశారు.మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గంలో సాయంత్రం 4:00 గంటలకు జరగనున్న ఈ సభకు జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి బహుజన మేధావులు, నాయకులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జోన్ ఇంచార్జ్ బానోత్ రవీందర్ నాయక్ కోరారు.సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ సభ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీకాంత్, ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షుడు మింద్రాల నర్సింగ్ రావు, ఎస్కే వాలి, స్వర్ణ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# పోట్రూ శ్రీనివాస్ దశదినకర్మలో నేతల నివాళులు


**కల్లూరు, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన పోట్రు రామారావు కుమారుడు పోట్రూ శ్రీనివాస్ (వాసు) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన దశదినకర్మ కార్యక్రమం ఆదివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్ రావు పాల్గొని శ్రీనివాస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు పోట్రు ప్రవీణ్, కల్లూరు కాంగ్రెస్ నాయకులు కూసునూరి బాల, బత్తుల రాము తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. గ్రామ ప్రజలు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీనివాస్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీనివాస్ సాదాసీదా స్వభావం, అందరితో కలిసిమెలిసి ఉండే గుణం వల్ల గ్రామ ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన అకస్మాత్తు మరణం కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలను కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సందర్భంగా పలువురు నేతలు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# నూతన గృహ ప్రవేశంలో మున్సిపల్ చైర్మన్



**కల్లూరు, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో లక్ష్మీపురం (రాళ్ల బంజరు) గ్రామంలో మాజీ సర్పంచ్ గుగులోతు సుక్య, లక్ష్మీ దంపతుల కుమారుడు కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, మౌనిక దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది.కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహాన్ని దర్శించి దంపతులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి స్వంత ఇల్లు అనేది ఒక కల అని, ఆ కల నెరవేరడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. గృహ ప్రవేశం వంటి శుభకార్యాలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జేబీఎం రాష్ట్ర కన్వీనర్ గుగులోతు బాల, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు మరియు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశం ముగిసింది.

# శంకరపట్నం బిజెపి మండల శాఖ నూతన కార్యవర్గం...



Bharatiya Janata Party - Telangana


Following Mandal has been declared in the due process of Sanghatana Samrachana Parv-2025 after Consensus by District President & District Samrachana Prabhari

District: Karimnagar Date:

Mandal: Shankarapatnam

| SL. No. | Designation | Name |
|---|---|---|
| 1 | Vice President-1 | ELKAPELLY SAMPATH |
| 2 | Vice President-2 | KOYYADA RAJITHA |
| 3 | Vice President-3 | RASAMALLA SRINIVAS |
| 4 | Vice President-4 | KANAKAM SAGAR |
| 5 | General Secretary-1 | NIMMASHETTI SAMPATH |
| 6 | General Secretary-2 | SUDAGONI SRINIVAS |
| 7 | Secretary-1 | VADLAKONDA RAJENDER |
| 8 | Secretary-2 | GAURAVENI SRINIVAS |
| 9 | Secretary-3 | GURRAM RENUKA |
| 10 | Secretary-4 | EREDDY SRINIVAS |
| 11 | Treasurer | BODA THIRUPATHI REDDY |
| 12 | Member-1 | GOPI KUMARASWAMY |
| 13 | Member-2 | KETHIRI MADHUKAR REDDY |
| 14 | Member-3 | MADUGULA VENKAT REDDY |
| 15 | Member-4 | KATHERAMALLA SANJEEV |
| 16 | Member-5 | NALLA RAJI REDDY |
| 17 | Member-6 | REDDY RAMANA REDDY (PEDDA) |
| 18 | Member-7 | GORLA RAJU |
| 19 | Member-8 | GIDDAMARI NARSAIAH |
| 20 | Member-9 | BHUPATHI PRASAD |
| 21 | Member-10 | GUNTUKA SADANANDAM |
| 22 | Member-11 | KANAKAM RAJAIAH |
| 23 | Member-12 | ADITHAM RAJU |
| 24 | Member-13 | ELAVENI RAJU |
| 25 | Member-14 | JANGILI ELLAMMA |
| 26 | Member-15 | MANDA SATHYANARAYANA |
| 27 | Member-16 | RAJINIKAR REDDY |
| 28 | Member-17 | RAYINI VINOD |
| 29 | Member-18 | BONTHALA RAVI |
| 30 | Member-19 | BAKARAPU RAMESH |
| 31 | Member-20 | MARAVENI SHRAVAN |
| 32 | Member-21 | KOTTE SRINIVAS REDDY |
| 33 | Member-22 | THADIGOPPULA ARAVIND |
| 34 | Member-23 | INUKONDA RAVINDER REDDY |
| 35 | Member-24 | KURAPATI SATHYANARAYANA |
| 36 | Member-25 | KONDAPARTHI KUMAR |
| 37 | Member-26 | MANDADI DEVENDER REDDY |
| 38 | Member-27 | CHADA ODHIREDDY |
| 39 | Member-28 | NELAVENI SAMAPATH |
| 40 | Member-29 | VIKRAM |
| 41 | Member-30 | YAMUNURI SRINIVAS |
| 42 | Member-31 | CHERLA MOHAN |
| 43 | Member-32 | MOLUGURI SATHYANARAYANA |
| 44 | Member-33 | PAIDIPELLI SRINIVAS |
| 45 | Member-34 | DONGALA ODELU |

District President Mandal/Division President



Bharatiya Janata Party - Telangana

Following Mandal Morchas has been declared in the due process of Sanghatana Samrachana Parv-2025 after Consensus by District President & District Samrachana Prabhari

District: Karimnagar Date:

Mandal: Shankarapatnam

| SL. No. | Designation | Name |
|---|---|---|
| 1 | ST Morcha Mandal President | Lokini Kumar |
| 2 | SC Morcha Mandal President | Kanakam Kumar |
| 3 | Mahila Morcha Mandal President | Cherla Vanitha |
| 4 | Yava Morcha Mandal President | Bojja Saiprakash |
| 5 | Kisan Morcha Mandal President | Remidi Rajireddy |
| 6 | OBC Morcha Mandal President | Vengala Praveen |

District President Mandal President

**శంకరపట్నం,ఏప్రిల్12(పీసీడబ్ల్యూ న్యూస్):**శంకరపట్నం మండల బిజెపి నూతన కార్యవర్గాన్ని ఆదివారం రోజునబిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ప్రకటించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. 45 మందితో మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు మండల ఉపాధ్యక్షులుగా ఎలుకపెల్లి సంపత్, కొయ్యడ రజిత, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్ ప్రధాన కార్యదర్శులుగాలి నిమ్మిశెట్టి సంపత్, సుదగోని శ్రీనివాస్ ,మండల కార్యదర్శులుగావడ్లకొండ రాజేందర్ గౌరవేణి శ్రీనివాస్ గుర్రం రేణుక రెడ్డి శ్రీనివాసు,కోశాధికారిగాలి బోడ తిరుపతిరెడ్డిలతో పాటు మరో 34 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు అనిల్ పేర్కొన్నారు.అలాగే ఎస్టి మోర్చ మండల అధ్యక్షుడిగా లోకిని కుమార్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా కనకం కుమార్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలుగా చెర్ల అనిత, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులుగా రేమిడి రాజిరెడ్డి, ఓబీసీ మోర్చ మండలాధ్యక్షుడుగా వెంగళ ప్రవీణ్, యువ మోర్చా మండల అధ్యక్షుడిగా బొజ్జ సాయి ప్రకాష్ లను ఎన్నుకున్నట్లు అనిల్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆమోదంతో పూర్తిస్థాయి నూతన కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

# కల్లూరు నుండి డబుల్ రోడ్డు కోసం వినతి

- రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వీస్ రోడ్ అవసరం
- మంత్రిని కోరిన చంద్రుపట్ల గ్రామ ప్రజలు



**కల్లూరు, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామస్తులు రహదారి సమస్యలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పలు శుభకార్యాలకు గ్రామశీ రావడంతో గ్రామానికి చెందిన వల్లభనేని రవికుమార్, కాటమనేని బాబురావు, తూము నరసింహారావు తదితరులు కల్లూరు నుండి చంద్రుపట్ల, రఘునాథపురం మీదుగా ఆంధ్ర సరిహద్దు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని కోరారు.గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా స్థానిక రైతులు పంట పొలాలకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందువల్ల రైతుల సౌకర్యార్థం సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. గతంలో గ్రామంలో రహదారి సదుపాయాలు లేని సమయంలో తానే రోడ్లు వేయించానని గుర్తుచేశారు.కల్లూరు నుండి రఘునాథ బంజర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని మరోసారి కోరుతూ గ్రామస్తులు మంత్రికి వివరించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టును పరామర్శించిన డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్ 12:(పి.సి.డబ్ల్యూ న్యూస్):** తొర్రూరు పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు బిఆర్కె న్యూస్ ప్రతినిధి దురుసోజు వీరాంజనేయులు, ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు ఆయనను ఆదివారం తొర్రూరు పట్టణంలో వీరాంజనేయులు స్వగృహంలో మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్, పరమశించి ప్రమాదానికి గల కారణాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహబూబాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, ఎస్పీ డాక్టర్ శబరీష్, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం పై ప్రత్యేక చర్యలు తీసుకొని మండల వారీగా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.వార్తల సేకరణలో వివిధ ప్రదేశాలకు వెళ్ళు సమయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వెళ్లి వచ్చే క్రమంలో టూవీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కార్లో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, తగిన జాగ్రత్తలు వహించాలని, వేసవి కాలంలో ఆరోగ్య నియమాలు పాటించాలని ఆయన కోరారు.డిపిఆర్ఓ వెంట జర్నలిస్టులు గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్, కొండ సతీష్, పోల్ రాజు, బజ్జూరి వాసు, కందికొండ కుమార్, పి.బిక్షపతి తదితరులు ఉన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

- సమస్యల పరిష్కారానికి అధికారులను సంప్రదించాలన్న మంత్రి సూచన





**కల్లూరు, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండల పరిధిలో గ్రామాల్లో నిర్వహించిన పలు శుభకార్యాల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును కల్లూరు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య ప్రధాన అనుచరుడు చందర్ రావు ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్‌ను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సబ్ కలెక్టర్ మరియు ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా స్పందించాలని కోరారు. అలాగే మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ మంచి పనుల కోసం వచ్చినప్పుడు వాటిని ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ, కాంగ్రెస్ నాయకులు శీలం కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, వల్లభనేని రవికుమార్, కాటమనేని బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చింతకుంట ఉప మండలం హిందూ సమ్మేళనం...







**కరీంనగర్ రూరల్,ఏప్రిల్12(పీసీడబ్ల్యూ న్యూస్):** చింతకుంట ఉప మండలం (చింతకుంట, కమాన్ పూర్, మల్కాపూర్, లక్ష్మీపూర్, బద్దిపల్లి) ల హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనానికి ముఖ్య వక్త గా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ బౌద్ధి ప్రముక్ సామల కిరణ్ జి మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో విభజన పెరుగుతున్న నేపథ్యంలో హిందువులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో ఐక్యత అత్యంత అవసరమని, అదిశగా హిందువులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలను సమాజంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా సామాజిక సమరత, కుటుంబ ప్రబోధన్, సంస్కృతి సాంప్రదాయాలు, పౌర నియమావళి, పర్యావరణం లాంటి ఐదు అంశాల ను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ హిందూ సమ్మేళన సభ అధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య ,, ముఖ్య అతిధి శ్రీ శ్రీ ముక్తానంద స్వామి జి, కామారపు మంజుల, రాష్ట్ర సేవికా సమితి జిల్లా సహ కార్య వాహిక,చింతకుంట ఉప మండలంలోనీ చింతకుంట, కమాన్ పూర్, మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాలకు సంబంధించిన హిందూ బంధువులు, వివిధ పార్టీ నాయకులు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొనారు.

# మల్లంపల్లిలో శ్రీ వెంకటేశ్వర ఐరన్ & హార్డ్‌వేర్ షాప్ ప్రారంభం...

- యువ వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తాం: మంత్రి సీతక్క



**మల్లంపల్లి మండల ప్రతినిధి, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మల్లంపల్లి మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన శ్రీ వెంకటేశ్వర ఐరన్ & హార్డ్‌వేర్ షాప్ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం ప్రారంభించారు. స్థానిక కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వర్ గౌడ్ స్థాపించిన ఈ దుకాణం ప్రాంత ప్రజలకు నిర్మాణ మరియు వ్యవసాయ పనులకు అవసరమైన హార్డ్‌వేర్ సామగ్రిని అందుబాటులోకి తీసుకురానుంది.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. స్వయం ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.అలాగే మండల స్థాయిలో ఇలాంటి వ్యాపార సంస్థలు ఏర్పడటం వల్ల ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా నిర్మాణ పనులు, వ్యవసాయ పనులకు అవసరమైన సామగ్రి సులభంగా లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.దుకాణం ప్రారంభించినందుకు మంత్రి సీతక్కకు ముత్యాల వెంకటేశ్వర్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులు, కాంట్రాక్టర్లు మరియు సాధారణ ప్రజలకు నాణ్యమైన హార్డ్‌వేర్ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు, పాండికుంట సర్పంచ్ నాగిడి రమణ రెడ్డి, కొడిశాలకుంట సర్పంచ్ వంచ రమ్మోహన్ రెడ్డి, దేవనగర్ సర్పంచ్ సంతోష్, ములుగు రైతు కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం స్థానిక ప్రజలు కొత్త వ్యాపార సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు.

# కౌన్సిలర్ రాంబాయి పుట్టినరోజు వేడుకలు

- చైర్మన్ మోహన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు
- భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని నాయకుల ఆకాంక్ష





**కల్లూరు, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డ్ కౌన్సిలర్ భూక్యా రాంబాయి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రోజంతా బిజీ షెడ్యూల్ మధ్య కూడా అందరూ కలిసి ఈ వేడుకను నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాంబాయి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు బహుమతిని అంధచేశారుఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, దాసరి సుధారాణి, పెద్ద బోయిన నరసింహారావు, యాసా నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, కమ్మంపాటి రాధా వీరస్వామి, గుండ్ల పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు గుగులోత్ బాలాజీ, యువ కాంగ్రెస్ నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు

- తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్ల ప్రభాకర్





**తల్లాడ, ఏప్రిల్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన తెలంగాణ రాష్ట్రంలో ప్రతి విద్యార్థిని విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, అన్నారుగూడెం సర్పంచ్ గొల్ల ప్రభాకర్ తెలిపారు. కృషి, పట్టుదల,సమయపాలనతో సాధించిన ఈ విజయము మీ భవిష్యత్తుకు ఒక బలమైన పునాది, భవిష్యత్తులో కూడా ఇటువంటి విజయాలు మరెన్నో సాధించాలని తల్లిదండ్రులకు మండలానికి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలక పాత్ర పోషించిందని వారు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇది మీ భవిష్యత్తు విజయాలకు తొలిమెట్టని అభినందించారు. పరీక్షల్లో విజయం సాధించిన ప్రతి విద్యార్థి మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని, దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.అలాగే, ఆశించిన ఫలితాలు రాని విద్యార్థులు నిరుత్సాహ పడకుండా మరింత కృషి, పట్టుదల ధృడ సంకల్పంతో భవిష్యత్తులో అద్భుతమైన విజయాలను సాధించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని వారు తెలిపారు.

# మోడరన్ లుక్, మైండ్ బ్లోయింగ్ టేస్ట్... సేరెన్ కేఫ్‌కు సూపర్ రెస్పాన్స్

**మాజీ మంత్రి హరీష్ రావు**
**చేతుల మీదుగా ఘన ప్రారంభం**
**మ్యూజిక్ & లైటింగ్‌తో ప్రత్యేక అనుభూతి**
**యూనిక్ ఇంటీరియర్స్ ప్రధాన ఆకర్షణ**
**చాయ్, బన్ మస్కా రుచులతో**
**కస్టమర్లను కట్టిపడేస్తోంది**
**యువతను ఆకట్టుకుంటున్న మోడరన్ కేఫ్**
**ప్రారంభంలోనే సక్సెస్ ట్రాక్‌లో కేఫ్**






**హైదరాబాద్ ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్, బాగ్ లింగంపల్లి ప్రాంతం మరో ఆకర్షణీయ వేదికను సొంతం చేసుకుంది. ఆధునిక హంగులతో, ప్రత్యేకమైన ఇంటీరియర్ డిజైన్‌తో రూపొందించిన 'సేరెన్ కేఫ్'ను మాజీ మంత్రి టీ. హరీష్ రావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రవి చారి సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు.కేఫ్‌లో ఏర్పాటు చేసిన మ్యూజిక్, లైటింగ్ సిస్టమ్ సందర్శకులను మొదటి చూపులోనే ఆకట్టుకునేలా ఉండగా, ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఇంటీరియర్స్ కేఫ్‌కు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. దాసరి రవిప్రసాద్ గారాలపట్టి దాసరి షాలిని అభిరుచికి అనుగుణంగా రూపొందించిన ఈ డిజైన్ అందరినీ మంత్ర ముగ్ధులను చేస్తోంది. ఇక్కడ లభించే చాయ్, బన్ మస్కా వంటి రుచికరమైన ఐటమ్స్ యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కాలేజ్ విద్యార్థులు, ఫాస్ట్-మూవింగ్ కస్టమర్లతో కేఫ్ ఎప్పుడూ సందడిగా మారుతూ ఉండటం, ప్రారంభ దశలోనే విజయ సంకేతాలను ఇస్తోంది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి స్వయంగా కేఫ్‌ను సందర్శించి, అక్కడి వాతావరణాన్ని ఆస్వాదించారు. కేఫ్‌లో ప్రత్యేకంగా అందించిన చాయ్‌ను రుచి చూసిన ఆయన, "ఇక్కడి చాయ్ టేస్ట్ నిజంగా మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. మోడరన్ అంబియన్స్‌తో పాటు సాంప్రదాయ రుచి కలయిక చాలా అరుదుగా కనిపిస్తుంది. యువతకు ఇది ఒక బెస్ట్ హ్యాంగౌట్ ప్లేస్ అవుతుంది" అంటూ ప్రశంసించారు. ఆయన సందర్శన కేఫ్‌కు మరింత గుర్తింపు తెచ్చింది. బాగ్ లింగంపల్లి ప్రాంతంలో ఇలాంటి మోడరన్ కేఫ్ లేకపోవడం 'సేరెన్ కేఫ్'కు అదనపు ప్లస్ పాయింట్‌గా మారింది. వినూత్న ఆలోచనతో ముందుకొచ్చిన యజమానులు స్థానికంగా మంచి స్పందనను అందుకుంటున్నారు. భవిష్యత్తులో 'సేరెన్ కేఫ్' లాభాల బాటలో ముందుకు సాగుతూ, రాష్ట్రవ్యాప్తంగా తన బ్రాంచ్‌లను విస్తరించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ఆధునికత, రుచి, వాతావరణం ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ 'సేరెన్ కేఫ్' నగర కేఫ్ కల్చర్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించనుందని విశ్వాసం వ్యక్తమవుతోంది.

# సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కూతురు వివాహం శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు





**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 2న జరిగిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కూతురు వివాహ వేడుకకు అప్పట్లో కేరళ ఎన్నికల ప్రచారంలో ఉన్న కారణంగా హాజరు కాలేకపోయిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అనంతరం కరీంనగర్ భాగ్యనగర్‌లోని నరేందర్ రెడ్డి నివాసానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు దంపతులకు శుభాభినందనలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి ఆనందాన్ని పంచుకున్నారు.

# రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించి ప్రభంజనం సృష్టించిన మోషన్ కాలేజీ

**ఇంటర్ ఫలితాలలో మోషన్**
**కాలేజీ విద్యార్థుల ప్రభంజనం**




**హన్మకొండ ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో మోషన్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంక్ లు సాధించి ప్రభంజనం సృష్టించారని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. బైపిసి మొదటి సంవత్సరంలో పెంట్కార్ లిఖిత 440 మార్క్ లకు గాను 438 మార్క్ లు ( 2638118414) సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినట్లు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఎంపీపీ రెండవ సం.లో బిట్ల హాసని 994 మార్క్ లు (2638217825), తీర్థల అశ్విత 993 మార్క్ లు (263821588), పల్లిక శ్రీ వర్ధత 992 మార్క్ లు (2638218959), దేవాన్స్ చౌహాన్ 992 మార్క్ లు (2638219732), ఇమ్మడి శరణ్య 991 మార్క్ లు (263822055) సాధించారు. ఎంపీపీ మొదటి సం.లో కంచ అశ్వర్య 466 మార్క్ లు (2638118058),బొమ్మిడి రక్షిత 465 మార్క్ లు (2638117932), దొంత సంజన 465 మార్కులు (2638118732) వీరితో పాటు అనేక మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్,ప్రిన్సిపాల్ మారపెల్లి సమ్మయ్య,కోటా అధ్యాపకులు అనూప్ కపూర్,పాఠక్, సీనియర్ అధ్యాపకులు సరోత్తంరెడ్డి,బిక్షపతి గౌడ్,శ్రీనివాస్ ఆఫీస్ స్టాఫ్ మండల రాజు,తాళ్లపెల్లి రమేష్ గౌడ్,శనిగరపు సుమన్,మౌనిక,కడారి అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ కుంట బడి బాలుర దాహార్తి తీర్చుటకై ఏ ఆర్ కే ఫౌండేషన్ 34 వేల విలువగల 2 హెచ్ పి మోటార్స్ దాతృత్వం

**షాద్ నగర్, ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏ ఆర్ కె ఫౌండేషన్ బంజారాహిల్స్ హైదరాబాద్ అధ్యక్షులు ఎన్ రవీందర్ రెడ్డి ,సెక్రెటరీ వినయ్ కుమార్ ,రాజేష్బోస్ ట్రెజరర్, వారిని కుంట బడి పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వడ్డేమోనీ బాలయ్య సంప్రదించగా విద్యార్థులకు పాఠశాలలోనీటి ఇబ్బంది కలదని తెలియ జేశారు .వారు స్పందిస్తూ టెక్స్మో మోటర్ 2 హెచ్పి సింగిల్ మోటర్ ను సుమారు 34వేల విలువగల మోటారును అందించడం జరిగింది .ఎ ర్ కే ఫౌండేషన్ వారు 2 ఆహ్ పి సింగల్ మోటర్ ను అందించినందులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ పిడి బాలయ్య సార్లు అదేవిధంగా ఆర్కే ఫౌండేషన్ సంస్థవారికి కృతజ్ఞతలు తెలియజేశారు.




# స్టేట్ టాప్ ర్యాంక్స్‌తో రెజోనెన్స్ విజయఢంకా







**హన్మకొండ ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇంటర్మీడియట్ విద్యామండలి తాజాగా విడుదల చేసిన ఇంటర్ మొదటి,రెండవ సంవత్సర ఫలితాల్లో హన్మకొండలోని రెజోనెన్స్ విద్యాసంస్థలలో ఇంటర్ మొదటి సంవత్సరంకు చెందినపొన్నాల వరుణ్ (2638101723) 468/470, కంపెల్లి తనుశ్రీ (2638105044) 468/470. ధోనికేనసహస్ర (2638102106) 468/470 మార్కులు సాధించి ఏకంగా స్టేట్ సెకండ్ ర్యాంక్స్ సొంతంచేసుకున్నారు. బై పి సి విభాగంలో గుమ్మడవెల్లి మహతి (2638104271) 438 / 440,బంక వైష్ణవి (2638103992) 437/440.సఫియా కౌసర్ (2638104782) 437/440,ధరావత్ లక్ష్మీప్రసన్న (2638104358) 437 /440 మార్కులు సాధించారు.ఎం పి సి రెండవ సంవత్సరం విభాగంలో జి.సాయికీర్తన (2638204178) 995.నారోజు హర్షల్ (2638205366) 994,దండె వర్ష (2638202797) 994 మార్కులతోను,బై పి సి విభాగంలో గంధ్ర శ్రీజ (2638201532) 991సుఫయా తబస్సుమ్ (2638206467) 989 మార్కులు సాధించారు. రెజోనెన్స్ విద్యాసంస్థలు జె.ఈ.ఈ.,నీట్ లాంటి జాతీయస్థాయి పోటీపరీక్షల్లో అత్యంత విలువైన ర్యాంకులతో పాటు రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యా ఫలితాల్లోనూ తమదే పైచేయి అని నిరూపించారు. ఎం పి సి మొదటి సంవత్సరం విభాగంలో స్టేట్ రెండవ ర్యాంకు 468/470 మార్కులు ముగ్గురు విద్యార్థులు,స్టేట్ మూడవ ర్యాంకు 467/470 పదకొండు మంది విద్యార్థులతో పాటు 465 పైన 63 మంది 460 పైన 241 మంది సాధించారు. ఎం పి సి,బై పి సి రెండవ సంవత్సరం విభాగంలో స్టేట్ టాప్ ర్యాంక్స్ 991,990 మార్కులతో పాటు 980 పైన 181 మంది సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రెజోనెన్స్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ...తమ విద్యార్థులు,స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఎంతో క్లిష్టమైన జాతీయ స్థాయి జె.ఈ. ఈ.,నీట్ పోటీపరీక్షల్లో చాలా గొప్ప ర్యాంకులు సాధిస్తూ ఐ ఐ టి లలోను, ఎన్ ఐ టి లలోను,మెడికల్ కాలేజీలలోను సీట్లు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తపరిచారు. ఇదే స్ఫూర్తితో రాబోయే జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జే.ఈ.ఈ అడ్వాన్స్ డ్ అండ్ నీట్ పోటీ పరీక్షలు టి ఎస్ ఈ ఎ పి సి ఈ టి ఇంకా ఇతర పోటీ పరీక్షలలో అత్యంత విలువైన టాప్ ర్యాంక్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ లెక్కల రాజిరెడ్డి,డైరెక్టర్స్ లెక్కల మహేందర్ రెడ్డి,మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి,సి ఎ ఓ లెక్కల రమ్యారాజిరెడ్డి, అకాడమిక్ డీన్ బి.యస్. గోపాలరావు,అన్ని బ్రాంచిల ప్రిన్సిపల్స్,వందలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# సిగాచి ప్రమాదంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మెట్టు శ్రీధర్



**పటాన్ చెరువు ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో జరిగిన ప్రమాదానికి సంబంధించి యాజమాన్యం మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.ఆదివారం పటాన్చెరు పట్టణంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను కలిసి, 2018 నుండి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా సమగ్ర ఫిర్యాదును సమర్పించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, సిగాచి ఇండస్ట్రీస్ గత ఏడు సంవత్సరాలుగా ఫ్యాక్టరీ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తూ వస్తోందని ఆరోపించారు. 2018-19లో అనుమతించిన 100 మంది కార్మికుల పరిమితిని మించి నియామకాలు జరిపినట్లు, 2022లో 818 న్యూ లైసెన్స్ ఉన్నప్పటికీ 1777 HP సామర్థ్యం గల యంత్రాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేసినట్లు వివరించారు.అలాగే 2019, 2021, 2023 సంవత్సరాల్లో జరిగిన తనిఖీల్లో యంత్రాలకు భద్రతా గార్డులు లేవని గుర్తించినప్పటికీ యాజమాన్యం చర్యలు తీసుకోలేదని, ప్రమాదకర రసాయనాలు ఉపయోగించే ఫ్యాక్టరీలో హాజర్డ్ అనాలిసిస్ నివేదికలు లేకపోవడం తీవ్ర ఆందోళనకరమని అన్నారు.ప్రతి ఏడాది లోపాలు బయటపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన విమర్శించారు.మరణించిన కార్మికుల కుటుంబాలకు పూర్తి స్థాయి నష్టపరిహారం అందించాలని, బాధ్యులైన యాజమాన్యం మరియు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

# ఆత్మరక్షణకు కరాటే చక్కటి సాధనం





**హైదరాబాద్ ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆత్మరక్షణ కోసమే కాదూ.. ఆరోగ్యానికి ‘కరాటే‘ చక్కటి సాధనంగా ఉపకరిస్తుందని సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే తెలంగాణ అసోసియేషన్ చైర్మన్ స్మిత బెన్ అన్నారు. సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ను ఆదివారం హిమాయత్ నగర్ లోని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్లో ఇండియా స్టైల్ చీఫ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ కోయోషి సిద్దార్థ్ షా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు నిర్వహించారు. కట్టా, అటాక్స్, కిక్స్, బ్లాక్, పంచ్, వెపన్స్, స్పైరింగ్స్ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తీర్ణత సాధించిన 38 మంది విద్యార్థులకు కలర్ గ్రేడింగ్ బెల్టులతో పాటు సర్టిఫికెట్స్ ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ బి. నాగరాజు, ఎగ్జామినర్ నవీన్ నాయక్, సెన్సెయి రచన, సెన్సెయి విశ్వత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏప్రిల్ 13వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

# నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




**మదనపల్లి ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 13 న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

# వచ్చే నెల 5 నుండి13 వరకు తిరుపతి గంగ జాతర


## • జాతర పోస్టర్లను ఆవిష్కరించిన కూటమి నేతలు

**తిరుపతి ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):**తాతయ్యగుంట గంగ జాతర ఆహ్వాన పత్రిక, కరపత్రం, గోడ పత్రికలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. మే 5వ తేది రాత్రి చాటింపుతో తాతయ్యగుంట గంగ జాతర ప్రారంభమై మే 13వ తేది తెల్లవారుజామున విశ్వరూప దర్శనంతో ముగుస్తాయని ఆయన వెల్లడించారు. మే 12వ తేది అంగరంగ వైభవంగా గంగ జాతర జరుగుతుందని ఆయన తెలిపారు. గంగజాతర పనులను ఆలయ పాలకమండలి చైర్మన్ మహేష్ యాదవ్, పాలకమండలి సభ్యులు నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. తిరుపతితో పాటు చుట్టు పక్కల గ్రామాలతో పాటు రాయలసీమ వ్యాప్తంగా అమ్మవారి ఆశ్శీశ్సుల కోసం జాతర సమయంలో వస్తారని ఆయన తెలిపారు. అమ్మవారి దర్శన భాగ్యం కల్పనలో సామాన్య భక్తులకే పెద్దపీటవేస్తామని ఆయన చెప్పారు. గంగజాతర ఏర్పాట్లను తాతయ్య గుంట గంగమ్మ




ఆలయ పాలకమండలి చైర్మన్ మహేష్ యాదవ్, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతర సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని పోనున్నట్లు ఆయన తెలిపారు. గంగజాతరను రాజకీయాలకు అతీతంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ మహేష్ యాదవ్ చెప్పారు. రాయలసీమతోపాటు తమిళనాడు, కర్నాటక నుంచి జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. జాతర పనులను పాలకమండలి సమిష్టిగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ లు, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, జేబి శ్రీనివాస్, పులుగోరు మురళీ, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వి ఎం శ్రీధర్, , కంకణాల రజనీకాంత్, జలపోతు చంద్ర, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఆముదాల వెంకటేష్, జానకీరామ్ రెడ్డి, ఆళ్వార్ మురళీ, కీర్తన, సుభాషిణి, రాజేష్ ఆచ్చారి, శిరీష, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాలయం నిర్మిస్తున్న కలియుగ కుచేలుడు








## పట్టు వదలని పేదవాని సంకల్పం

## దాతల సహకారం మరువలేనిది

**లింగాల ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):**ఆనాడు ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడికి తన బాల్య స్నేహితుడు కుచేలుడు అటుకులు ప్రేమ,భక్తితో ఇచ్చాడని పుస్తకాలల్లో చదివాము. కానీ ఈనాడు రామట్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతు మేకల రామ్మోహన్ యాదవ్ ను“అభినవ కుచేలుడు“ గా అభివర్ణించడంలో ఎలాంటి అతిశయోక్తిలేదనుటలో సందేహం వలదు. వివరాల్లోకి వెళ్లితే మండల పరిధిలోని రామట్లపల్లి గ్రామా సమీపంలో నూతనంగా శ్రీకృష్ణ ఆలయం కోటి యాభై లక్షల రూపాయలతో నిర్మాణం జరుగుతోంది. **పట్టువదలని పేదరైతు సంకల్పం:** రెక్కాడితే గాని డొక్కాడని ఈపేద రైతును ఏసమయంలో శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించాడో గాని ఈ అభినవ కుచేలుడు దేవాలయ నిర్మాణాన్ని 2018 నవంబర్ 18 వతేది ప్రారంబించాడు.నిద్రాహారాలు మాని చేతిలో చిల్లిగవ్వ లేకున్నా శ్రీకృష్ణుని మీద భారం వేసి ధృడ సంకల్పంతో అడుగు ముందుకు వేశాడు. భగవంతుని ఆశీస్సులతో,దాతల సహకారంతో ప్రస్తుతానికి ఆలయం 80శాతం పనులు పూర్తి చేశాడు.ఇందులో పాడా(పులివెందుల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) నుంచి 55 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించి భక్తులకోసం 4 వసతి రూములు నిర్మించారు , కాంక్రీటువాల్, మట్టి పూడిక పనులు చేశారు.అలాగే దేవాదయశాఖ వారు 65 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. ఈ నిధులతో దేవాలయం చుట్టూ, ప్రధాన ఆలయం,ఇటుకతో కాంపౌండ్ గోడ నిర్మించడం జరుగుతోంది. **లక్షా ముప్పై వేల తో మూలవిరాట్ గ్రహం:** తమిళనాడులోని తంజావూర్ నుంచి మూలవిరాట్ శ్రీకృష్ణుని గ్రహాన్ని లక్షా 30 వేల రూపాయలతో తయారు చేయించి తీసుకువచ్చారు. ఆలయంలో లోపలి కప్పు పైభాగంలో రాశి ఫలాల బొమ్మలు, ఆలయం ముందు భాగంలో చూడచక్కని గోమాతలు, లేగదూడలు చూపరులను ఆకట్టుకునే విధంగా రూపొందించారు. ప్రస్తుతం గుడి నిర్మాణం పూర్తి కావాల్సి ఉండడంతో అంతవరకు గ్రామంలోని ఒక ప్రదేశంలో నవధాన్యాలలో శ్రీకృష్ణ విగ్రహాన్ని ఉంచాడు. ఆలయ నిర్మాణం పూర్తయిన వెంటనే వివిధరకాలపూజలు,అభిషేకాలు అర్చకులతో నిర్వహించి శ్రీకృష్ణుని మూలవిరాట్ విగ్రహకి ప్రాణప్రతిష్ట చేస్తారు. ప్రస్తుతం మిగిలి ఉన్న పనులు పూర్తికావడానికి దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తే త్వరలోనే కృష్ణాలయాన్ని ప్రారంభించేందుకు మార్గం సుగమవుతుందిని ఆయన అన్నారు. **దాతల సహకారం మరువలేనిది:** శ్రీకృష్ణ దేవాలయాన్ని నిర్మించుటకు తమ వంతుగా దాతలు చేసిన సహాయం ఎప్పటికీ మరువలేనిది. దేవాలయం నిర్మాణంలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలనే భక్తులు 9704321 311 నెంబర్ కు ఫోన్ చేసి తమవంతు సహాయ సహకారాలు అందించి శ్రీకృష్ణుడి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్మాత రామ్మోహన్ యాదవ్ కోరారు.

# ఆట.. వేట.. చివరకు కన్నీటి మూట!

## క్రికెట్ బెట్టింగ్ మాయాజాలంపై అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ , ప్రత్యేక కథనం

**మదనపల్లి, ఏప్రిల్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** అది ఒక మధ్యతరగతి గడప. ఆ ఇంట్లో పండుగ వాతావరణం ఉండాలి. కానీ, అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కారణం.. ఆ ఇంటి ఆశల దీపం, ఒక యువకుడు ‘క్రికెట్ బెట్టింగ్’ అనే మాయలో పడి తన జీవితాన్ని, తన తల్లిదండ్రుల పరువును పందెంగా పెట్టాడు. మొన్నటిదాకా ఫోన్ లో సిక్సర్ కొడితే చిందులేసిన ఆ యువకుడు, ఈరోజు అప్పుల వాళ్ల భయంతో ఎక్కడికో పారిపోయాడు. ఇది ఎక్కడో ఒకచోట ప్రతిరోజూ వినిపిస్తున్న మూగ రోదన.ఈ ఐపీఎల్ సీజన్ లో సరదా పేరుతో మొదలయ్యే ఈ ‘బెట్టింగ్‘ వ్యసనం, చివరకు ఎలా ఒక మనిషిని నేరస్థుడిగా మారుస్తుందో అన్నమయ్య జిల్లా ఎస్పీ లిశ్రీ ధీరజ్ కునుబిల్లి జిల్లా ప్రజలను అప్రమత్తం చేస్తూ కళ్లు తెరిపించే వాస్తవాలను వివరించారు.గతంలో జూదం అంటే వీధి చివరన రహస్యంగా ఆడేవారు. కానీ ఇప్పుడు మీ బిడ్డ చేతిలో ఉన్న సెల్‌ఫోనే ఒక ప్రమాదకరమైన జూదశాలగా మారింది.ఒక యాప్ డౌన్‌లోడ్ చేస్తారు. ఎవరో అపరిచితుడు పంపే లింక్ ద్వారా వందలు వేలు గెలుస్తారు. ఇదే బానిసను చేసే ‘గాలం’. వేస్తారు గెలిచిన డబ్బుతో విలాసాలకు అలవాటు పడతారు. ఒక్కసారి ఓడిపోగానే, ఆ డబ్బును తిరిగి సంపాదించాలనే కసితో తల్లిదండ్రుల నగలు, ఆస్తులు తాకట్టు పెడతారు.అప్పులు తీర్చలేక దొంగతనాలు, సైబర్ నేరాలు లేదా ఆత్మహత్యలకు పాల్పడతారు.మీ




అబ్బాయి ఫోన్ లో ఏమి చూస్తున్నాడు? మ్యాచ్ జరుగుతున్నప్పుడు విపరీతమైన టెన్షన్ పడుతున్నాడా? అకస్మాత్తుగా డబ్బుల కోసం అబద్ధాలు చెబుతున్నాడా? అయితే అతను ప్రమాదంలో ఉన్నట్టే! “మీ పిల్లల చేతికి ఫోన్ ఇచ్చేముందు, అది వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతుందో లేక మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తుందో గమనించండి“ అని ఎస్పీ హెచ్చరించారు. “యువతా..! మేము కేవలం మైదానంలోనే కాదు.. మీ ఫోన్ లోని డేటాలో కూడా నిఘా ఉంచాం“ అని ఎస్పీ స్పష్టం చేశారు.జిల్లా సైబర్ క్రైమ్ విభాగం బెట్టింగ్ వెబ్‌సైట్లను, అక్రమ లావాదేవీలను నిరంతరం గమనిస్తోంది.బెట్టింగ్ కేసులో చిక్కుకుంటే క్రిమినల్ రికార్డు నమోదవుతుంది. దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగాలు రావు, విదేశాలకు వెళ్లే పాస్‌పోర్ట్ దొరకదు. చదువుకున్న చదువు బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.బుకీల మీద, వాట్సాప్ గ్రూపుల మీద నిరంతరం నిఘా ఉంచాం. నేరం రుజువైతే జైలు శిక్ష తప్పదని యువతకు ఎస్పీ సూచించారు .“ఒక్క నిమిషం ఆలోచించండి.. మీరు పందెం కాసే ప్రతి రూపాయి మీ తండ్రి చెమట చుక్క లేదా మీ తల్లి కళ్లలోని ఆశ. ఎవరో బుకీ మీ డబ్బుతో మేడలు కట్టుకుంటుంటే, మీరు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోవాలా? ఆటను ఆటలాగే చూడండి.. దాన్ని జీవితాన్ని చిన్నాభిన్నం చేసే జూదంగా మార్చకండి.“ అని ఎస్పీ యువతకు సందేశం ఇచ్చారు.జిల్లా ప్రజలారా..! మీ వీధిలో లేదా గ్రామంలో బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీ వివరాలు రహస్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు .

# కృనాల్ పాండ్యా విసిరేసే బంతులను ముంబై బ్యాటర్లు ఎలా ఫేస్ చేస్తారో



ఐపీఎల్ 2026లో భాగంగా నేడు డబుల్ హెడ్డర్స్ జరుగనున్నాయి. ఈ మధ్యాహ్నం 3:30 గంటలకు లక్నో సూపర్ జెయింట్స్ తో తలప డబోతోంది గుజరాత్ టైటాన్స్. లక్నోలోని అటల్ బిహారీ వాజ్ పేయి ఏక్నాస్టేడియం దీనికి వేదిక. మరో మ్యాచ్ ముంబై ఇండియన్స్- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరుగనుంది. ఈ సాయంత్రం 7:30 గంటలకు జరిగే ఈ గేమ్ కు వాంఖెడే స్టేడియం ఆతిథ్యాన్ని ఇవ్వనుంది.

కేరీర్ చివరి దశలో ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల మధ్య పోటీగా దీన్ని చూడొచ్చు. వాళ్లే ఈ మ్యాచ్కు ప్రత్యేకం.. ప్రధాన ఆకర్షణ కూడా. ఐపీఎల్ లో ఇప్పటికే ఈ దిగ్గజ ఆటగాళ్లు అద్భుతంగా ఆడుతున్నారు. తమ తమ జట్లకు మూలస్తంభాల్లా నిలిచారు. ఈ రెండు జట్లు కూడా రాజస్థాన్ రాయల్స్తో ఓడాయి. విజయం కోసం ఆతృతగా ఎదురు చూస్తోన్నాయి. హోమ్ పిచ్ కావడం ముంబై ఇండియన్స్ కు కలిసి వచ్చే అంశం. కృనాల్ పాండ్యా మరో అట్రాక్షన్ గా నిలువనున్నాడు. స్పిన్నరే అయినా బంతులను బుల్లెట్లలా సంధిస్తోన్నాడీ మధ్య. బౌన్సర్లు వేస్తోన్నాడు. అతన్ని ఎలా ఎదుర్కొంటారనేది ఈ సాయంత్రం తేలుతుంది.

ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఐపీఎల్లో ఇప్పటివరకు మొత్తం 34 మ్యాచ్లు జరిగాయి. ఇందులో ముంబై 19 మ్యాచ్లు గెలిచింది. 15 మ్యాచ్లలో ఓడింది. విజయాల్లో పెద్ద తేడా లేదు. ప్రతీసారీ హోరాహోరీగా తలపడ్డాయి. స్టేడియంలో పరుగుల వరద పారించాయి. ఈ సాయంత్రం జరిగే మ్యాచ్ కూడా ఇదే రేంజ్ లో ఉండొచ్చని సగటు అభిమాని ఆశిస్తోన్నాడు. మొదట ఎవరు బ్యాటింగ్ చేసినా 200 ప్లస్ స్కోర్ ఉండొచ్చు.

పిచ్ రిపోర్ట్..ముంబై వాంఖడే స్టేడియం పిచ్ భారీ స్కోర్లకు అనువుగా ఉంటుంది. బ్యాటింగ్కు పూర్తిగా అనుకూలంగా ఉండే ఈ పిచ్ పై పరుగుల వరద పారడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పిచ్ పై పడే బంతి.. పేస్, బౌన్స్ ను అద్భుతంగా క్యారీ చేస్తుంది. బ్యాటర్లు ప్రారంభం నుంచే స్వేచ్ఛగా షాట్లు ఆడగలరు. ఇది ఐపీఎల్ లో అత్యంత బ్యాటింగ్ ఫ్రెండ్లీ పిచ్ లల్లో ఒకటి.ముంబై ఇండియన్స్ తుదిజట్టులో– రోహిత్ శర్మ, రియాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), నమన్ ధీర్, మిచెల్ సాంట్నర్, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా ఆడే అవకాశం ఉంది.

# వైభవ్ సూర్యవంశీ సంపాదన, ఆస్తుల విలువ ఎంతో తెలుసా..

వైభవ్ సూర్యవంశీ. ఇప్పుడు ఈ పేరు ఓ సంచలనం. ఐపీఎల్ వైభవ్ సూర్య వంశీ పేరు కాదు.. ఒక బ్రాండ్. అతి పిన్న వయసులో దిగ్గజాలైన బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. బౌలర్ ఎవరైనా సరే.. బంతిని బౌండరీకి తరలించటమే అతని లక్ష్యం. యావత్ క్రికెట్ ఫ్యాన్స్ ప్రశంసలతో ముంచెత్తున్నారు. ప్రత్యర్థి టీంలకు చెమటలు పట్టిస్తున్న వైభవ్ సూర్య వంశీ ఆదాయ లెక్కలు అంతే సంచలనం. ఈ యువ కెరటం సంపాదన లెక్కలు మరీ ఆసక్తి కరం.వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది ఐపీఎల్ తో ఆరంగేట్రం చేసి.. ప్రస్తుత సీజన్ లో సం చలనంగా ఎదిగాడు. వైభవ్ సూర్యవంశీ బా ్యటింగ్ కోసం యావత్ క్రికెట్ ఫ్యాన్స్ వేచి చూస్తున్నారు. వణికించే బౌలర్లకు సైతం చుక్కలు చూపిస్తున్నాడు. 15 ఏళ్ల వయసులో ఐపీఎల్ క్రికెట్ లో సంచలనాలు నమోదు చేస్తున్న ఈ కుర్రాడి సంపాదన పైన చర్చ జరుగుతోంది. వచ్చే ఐపీఎల్ ఆక్షనలో వైభవ్



కోసం ఫ్రాంచైజీలు ఎంత పెట్టటానికైనా సిద్ధపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆర్సీబీ, ముంబాయి ఇండియన్స్ వైభవ్ కోసం పోటీలో ఉన్నట్లు ఇప్పటికే ప్రచారం సాగుతోంది. అయితే, అసలు రాజస్థాన్ వైభవ్ ను వదులుకుంటుందా అనేది సందేహమే. ఎక్కడా గర్వం లేకుండా పూర్తిగా పరిణితి సాధించిన తరహాలో వైభవ్ ఆటతీరు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇక, వైభవ్ ఆదాయం పైన ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.ఐపీఎల్ 2026 వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్ సూర్యవంశీని రూ.1.10 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డు సృష్టించిన వైభవ్ ఒక్కో మ్యాచ్కు రూ. 15 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. లీగ్ దశలోని 14 మ్యాచ్లకు వైభవ్ సూర్యవంశీ చేసుకున్న ఒప్పందం మేరకు ఒక్కో మ్యాచ్కు సుమారు రూ. 7.85 లక్షల ఆదాయం సమకూరుతుంది. కాగా.. ఐపీఎల్ నిబం ధనల ప్రకారం.. ఆడే ప్రతి మ్యాచ్కు అదనంగా రూ. 7.50 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఈ రెండు రకాల ఆదాయం కలిపితే, వైభవ్ ఒక్కో మ్యాచ్కు సుమారు రూ. 15.35 లక్షలు సంపాదిస్తున్నాడు. అదే విధంగా వీటితో సంబంధం లేకుండా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పట్టాడు.

# మ్యాచ్ గెలిచినా.. ఆనందం లేకపాయె

ఐపీఎల్ 2026 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ బ్యాట్స్మెన్ సంజూ శాంసన్ ఎట్టకేలకు ఫామ్ను అందిపుచ్చుకున్నాడు. సెంచరీతో ట్రాక్ ఎక్కాడు. బౌలర్లపై తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. అతను ఫామ్ లోకి రావడం అభిమానులను ఊపిరి పీల్చుకునేలా చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో శనివారం జరిగిన మ్యాచ్లో అనూహ్యంగా పుంజుకున్న ఈ ఓపెనర్ అద్భుతమైన శతకంతో తన సత్తా చాటాడు. జట్టు భారీ స్కోరు సాధించడంలో, ఘన విజయాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషించాడు.ఈ ఆనందం చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కు దక్కలేదు. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించిన కారణంగా అతనిపై భారీ ఫైన్ పడింది. ఈ సీజన్ లో కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించిన కేప్టెన్ల జాబితాలో అతను మూడోవాడు. మ్యాచ్ సందర్భంగా చెన్నై సూపర్ కింగ్స్ స్లో ఓవర్-రేట్ను కొనసాగించినందుకు గైక్వాడ్పై జరిమానా




పడింది.ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇది జట్టుకు తొలి తప్పు కావడంతో అతడిపై 12 లక్షల రూపా యల జరిమానా విధించింది బీసీసీఐ. ఈ సీజన్ లో ఇప్పటికే శ్రేయాస్ అయ్యర్ రెండు సార్లు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడు. మార్చి 31న న్యూ చండీగఢ్లో పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్తో జరిగిన మ్యాచ్లో స్లో ఓవర్-రేట్ కారణంగా అతడు సీజన్లో మొదటిసారి జరిమానాకు గురయ్యాడు.

ఈ నెల 2న చెన్నైతో జరిగిన తదుపరి మ్యా చ్లోనే అయ్యర్ మళ్లీ నియమావళిని ఉల్లం ఘించాడు. ఇది రెండో నేరం కావడంతో అతను 24 లక్షల రూపాయలను జరిమానాగా చెల్లించాల్సి వచ్చింది. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్మన్ గిల్ కూడా ఏప్రిల్ 8న ఢిల్లీ క్యాపిటల్స్తో జరిగిన మ్యాచ్లో స్లో ఓవర్-రేట్ కారణంగా ప్రవర్తనా నియమావళిని ఉల్లం ఘించాడు.మరోవైపు, బీసీసీఐ ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ నితీష్ రాణాకూ జరిమానా విధించింది. చెన్నై సూపర్ కింగ్స్తో జరిగిన మ్యాచ్లో అంపైర్తో వాగ్వాదానికి దిగినందుకు ఈ చర్య తీసుకున్నారు. 19వ ఓవర్లో ట్రిస్టన్ స్టబ్స్ గ్లోవ్స్ మార్చుకోవడానికి మ్యాచ్ అధికారి అనుమతించకపోవడం దీనికి కారణమైంది. స్టబ్స్ అవుట్ అయ్యాడు. దీంతో నితీష్ అం పైర్తో వాగ్వాదానికి దిగాడు.రాణాకు ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 ఉల్లంఘన కింద మ్యాచ్ ఫీజులో విధించారు.

# ట్రాక్ ఎక్కేశాడు- కాచుకోండి ఇక



ఐపీఎల్ 2026 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ బ్యాట్స్మెన్ సంజూ శాంసన్ ఎట్టకేలకు ఫామ్ను అందిపుచ్చుకున్నాడు. సెంచరీతో ట్రాక్ ఎక్కాడు. బౌలర్లపై తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. అతను ఫామ్ లోకి రావడం అభిమానులను ఊపిరి పీల్చుకునేలా చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో శనివారం జరిగిన మ్యాచ్లో అనూహ్యంగా పుంజుకున్న ఈ ఓపెనర్ అద్భుతమైన శతకంతో తన సత్తా చాటాడు. జట్టు భారీ స్కోరు సాధించడంలో, ఘన విజయాన్ని అందుకోవడంలో కీలక పాత్ర పోషించాడు.సెంచరీ కోసం సంజు శాంసన్ తీసుకున్న బంతులు 52 మాత్రమే. అతని ఇన్నింగ్స్లో ఏకంగా బుల్లెట్ల వంటి 14 బౌండరీలు, మూడు భారీ సిక్సర్లు ఉన్నాయి. గత మూడు మ్యాచ్లలో వరుసగా 6, 7, 9 పరుగులకే పరిమితమైన అతను ఈ మ్యాచ్తో ఒక్కసారిగా గేర్ మార్చాడు. అద్భుతంగా పుంజుకున్నాడు. ఈ శతకం అతని ఐపీఎల్ కెరీర్లో నాలుగోది కాగా, చెన్నై సూపర్ కింగ్స్ తరపున సాధించిన మొదటి శతకం ఇదే కావడం విశేషం.ఈ సెంచరీ ఇన్సింగ్స్లో శాంసన్ మరో మైలురాయిని కూడా అందుకున్నాడు. తన టీ20 కెరీర్లో మొత్తం 400 సిక్సర్లను బాదాడు. 52 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉన్నప్పుడు పథుమ్ నిశ్శంక అతని క్యాచ్ను జారవిడిచాడు. దీంతో అనేక రికార్డులను తిరగరాశాడు. 2021లో ఐపీఎల్ లో చివరిసారిగా సెంచరీ చేశాడు సంజు. ఆ తర్వాత మళ్లీ శతకం ముఖం చూడటం ఇదే. ఈ ఐపీఎల్ సీజన్లో నమోదైన మొదటి శతకమూ ఇదే.

ఈ మ్యాచ్ లో శాంసన్ ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడి 56 బంతుల్లో 115 పరుగులు సాధించాడు. ఫలితంగా సీఎస్కే 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ శతకం సంజూ ఐపీఎల్ కెరీర్లోకెల్లా అత్యంత వేగవం తమైనది. 2019లో 55 బంతుల్లో సెంచరీ సాధించిన శాంసన్.. ఈసారి 52 బంతుల్లోనే ఈ ఘనత సాధించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో తన పాత రికార్డును తానే బద్దలు కొట్టాడు.ఐపీఎల్కు ముందు జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026లో సంజూ శాంసన్ కనబరిచిన ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

# లక్నో గడ్డపై దంచేసిన గిల్, బట్లర్.. గుజరాత్కు రెండో విజయం..

పంతొమ్మిదో సీజన్లో గుజరాత్ టైటాన్స్ వరసగా రెండో విజయం సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) త్వరగా ఔటైనా శుభ్మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్తో చెలరేగాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను సులువుగా ఎదుర్కొన్న జోస్ బట్లర్(60), గిల్ గుజరాత్ను గెలుపు దిశగా నడిపారు. రెండో వికెట్కు అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయం వెంటవెంటనే ఔటైనా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. ఏడు వికెట్లతో గెలుపొందిన గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.సొంత మైదానంలో పంజా విసరాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్(రా+)కు భారీ షాకిచ్చింది గుజరాత్ టైటాన్స్. తొలుత ప్రసిధ్ కృష్ణ() సంచలన స్పెల్తో లక్నోను 164కే కట్టడి చేసిన గుజరాత్ మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) విఫలమైనా శుభ్మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్తో ఆకట్టుకున్నాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వని గిల్.. జోస్ బట్లర్(60) స్కోర్ బోర్డును ఉరికించారు. గిల్ కళాత్మక షాట్లతో అలరించగా.. బట్లర్ స్కూప్, రివర్స్ స్వీప్



షాట్లతో చెలరేగాడు.రెండో వికెట్కు 84 పరుగులు జోడించిన గిల్ను ప్రిన్స్ యాదవ్ వెనక్కి పంపాడు. కాసేపటికే షమీ ఓవర్లో బట్లర్ సిక్సర్కు యత్నించి బౌండరీ వద్ద మర్క్రమ్ స్టన్నింగ్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్)తో కలిసి రాహుల్ తెవాటియా(10 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వలేదు. ప్రిన్స్ ఓవర్లో 4, 6 బాదిన సుందర్ లాంఛనం పూర్తి చేశాడు. దాంతో.. వరసగా సన్రైజర్స్, కోల్కతాపై గెలుపొందిన లక్నోకు ఓటమి తప్పలేదు.ప్రసిధ్ దెబ్బకు విలవిలపంతొమ్మిదో సీజన్లో హ్యాట్రిక్ కొట్టాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ మోస్తర్ స్కోర్కే పరిమితమైంది. సొంత మైదానంలో చెలరేగిపోవాలనుకున్న లక్నో జట్టుకు గుజరాత్ టైటన్స్ పేసర్ ప్రసిధ్ కృష్ణ(4-28) షాకిచ్చాడు. పవర్ ప్లేలోనే కగిసో రబడ(1-54), ప్రసిధ్ ధాటికి రెండు వికెట్లు కోల్పోయిన లక్నో ఏ దశలోనూ పుంజుకోలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన గుజరాత్ పేసర్లు లక్నో హిట్టర్లకు బ్యాట్ ఝులిపించే అవకాశమివ్వలేదు.ప్రసిధ్ ధాటికి 69కే మూడు వికెట్లు పడిన వేళ పవర్ హిట్టర్ ఆయుశ్ బదొని(9), నికోలస్ పూరన్(19)లు లక్నోను ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, ఈ ఇద్దరి సైతం వెనక్కి పంపిన ప్రసిధ్ స్కోర్ వేగానికి బ్రేకులు వేశాడు. కుర్రాళ్లు అబ్దుల్ సమద్(18), ముకుల్ చౌదరీ(18) మెరవగా.. ఆఖర్లో ఇంప్యాక్ట్ సబ్ జార్జ్ లిండే(16)ధనాధన్ ఆడడంతో చేయగలిగింది.

# టాస్ గెలిచిన ముంబై.. దిగ్గజాల పోరులో గెలుపు ఎవరిది..



పంతొమ్మిదో సీజన్లో మరో బిగ్ మ్యాచ్కు వేళైంది. భారత దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు అమీతుమీకి సిద్ధమయ్యారు. డబుల్ హెడర్ రెండో మ్యాచ్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ను ఢీ కొడుతోంది.ఐపీఎల్ ఆరంభం నుంచి ఈ స్టేడియంలో ఆర్సీబీపై ఆధిపత్యం చెలాయిస్తున్న ముంబై ఇప్పుడు కూడా విజయంపై కన్నేసింది. భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశమున్న ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన హార్దిక్ పాండ్యా బౌలింగ్ తీసుకున్నాడు.

ముంబై తుది జట్టు : రోహిత్ శర్మ, రియాన్ రికెల్టన్(వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా(కెప్టెన్), నమన్ ధిర్, మిచెల్ శాంట్నర్, శార్దూల్ ఠాకూర్, బౌల్ట్, మయాంక్ మార్కండే, బుమ్రా.ఇంప్యాక్ట్ సబ్స్ -- షెర్ఫానే రూథర్ఫోర్డ్, కార్బిన్ బాస్చ్, అశ్వనీ కుమార్, రఘు శర్మ, రజ్ బవా.

ఆర్సీబీ తుది జట్టు : ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవ్దత్ పడిక్కల్, రజత్ పటిదార్(కెప్టెన్), టిమ్ డేవిడ్, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, జాకబ్ డఫ్ఫీ, సుయాశ్ శర్మ.ఇంప్యాక్ట్ సబ్స్ -- రసిక్ దార్ సలాం, వెంకటేశ్ అయ్యర్, జాకబ్ బెథెల్, స్వప్నిల్ సింగ్, మంగేశ్ యాదవ్.

# లక్నోను పడగొట్టిన ప్రసిద్.. గుజరాత్ను ఊరిస్తున్న లక్ష్యం..




సొంత మైదానంలో దుమ్మురేపాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ అనూహ్యంగా తడబడింది. గుజరాత్ టైటాన్స్ పేసర్ ప్రసిద్ కృష్ణ(4-28), నిప్పులు చెరగడంతో లక్నో బ్యాటర్లు చేతు లెత్తారు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా ఓపెనర్ ఎడెన్ మర్క్రమ్(30), కెప్టెన్ రిషభ్ పంత్(18), గత మ్యాచ్ హీరో ముకుల్ చౌదరీ(18)లు రాణించడంతో లక్నో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది.పంతొమ్మిదో సీజన్లో హ్యాట్రిక్ కొట్టాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ మోస్తర్ స్కోర్కే పరిమితమైంది. సొంత మైదానంలో చెలరేగిపోవాలనుకున్న లక్నో జట్టుకు గుజరాత్ టైటన్స్ పేసర్ ప్రసిధ్ కృష్ణ(4-28) షాకిచ్చాడు. పవర్ ప్లేలోనే కగిసో రబడ(1-54), ప్రసిధ్ ధాటికి రెండు వికెట్లు కోల్పోయిన లక్నో ఏ దశలోనూ పుంజుకోలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన గుజరాత్ పేసర్లు లక్నో హిట్టర్లకు బ్యాట్ ఝులిపించే అవకాశమివ్వలేదు.ప్రసిధ్ ధాటికి 69కే మూడు వికెట్లు పడిన వేళ పవర్ హిట్టర్ ఆయుశ్ బదొని(9), నికోలస్ పూరన్(19)లు లక్నోను ఆదుకునే ప్రయత్నం చేశారు.

# ఆఖరి మెట్టుపై తడబడినా.. రజతంతో చరిత్ర సృష్టించిన ఆయుశ్



బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్షిప్స్లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. అదిరే ఆటతో ఫైనల్ చేరిన ఆయుష్ స్వర్ణానికి బదులు రజతంతోనే సరిపెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన పురు షుల సింగిల్స్ టైటిల్ పోరులో భారత కుర్రాడి జైత్రయాత్రకు చైనా ఆటగాడు షీ యూ కీ చెక్ పెట్టాడు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన షీ వరస సెట్లలో జోరు చూపించి విజేతగా నిలిచాడు.చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్షిప్స్లో ఆయుష్ శెట్టి సిల్వర్ మెడల్ సాధించాడు. సెమీస్లో టాప్ సీడ్ను ఓడించిన ఈ కుర్రాడు ఫైనల్లో మాత్రం తేలిపోయాడు. వరస సెట్లలో షీ యూ కీ(చైనా) జోరు ముందు తలవంచిన ఆయుశ్ మ్యాచ్ను అప్పగించేశాడు.

తొలి సెట్ను 8-21తో కోల్పోయిన భారత షట్లర్ రెండో సెట్లోనూ పుంజుకోలేదు. 21-10తో గెలుపొందిన షీ పసిడి పతకాన్ని ఎగరే సుకుపోయాడు. 61 ఏళ్ల తర్వాత ఈ లీగ్లో పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆడిన తొలి భారతీయుడిగా రానున్నాడు

# కోల్కతాకు గుడ్న్యూస్.. యార్కర్ కింగ్ వచ్చేస్తున్నాడు..




పంతొమ్మిదో సీజన్లో పరాజయా పరంపర కొనసాగిస్తున్న కోల్కతా నైట్ రైడర్స్ గుడ్న్యూస్. బోణీ కోసం నిరీక్షిస్తున్న కోల్క తాను గెలుపు తోవ తొక్కించేందుకు మథీశ పథిరనసిద్ధమవుతున్నాడు. పొట్టి ప్రపంచకప్ గాయం నుంచి కోలుకున్న పథిరన శ్రీలంక బోర్డు కొత్తగా ప్రవేశపెట్టిన ఫిట్నెస్ పరీక్షలో పాసయ్యాడు.

తద్వారా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అందుకున్న ఈ యార్కర్ కింగ్ త్వరలోనే కేకేఆర్ స్క్వాడ్లో కలువనున్నాడు.మాజీ ఛాంపియన్ కోల్కతా నైట్ రైడర్స్ బౌలింగ్ కష్టాలు తీరనున్నాయి. ప్రధాన పేసర్లు హర్షిత్ రానా, ఆకాశ్ దీప్లు దూరమవ్వడంతో భారీ స్కోర్లు సర్పించుకుంటున్న ఆ జట్టు రాత మార్చేందుకు పథిరన వస్తున్నాడు. ఫిట్నెస్ పరీక్షలో గట్టెక్కిన ఈ యువ పేసర్ ఒకటి రెండు రోజుల్లో కోల్కతా స్క్వాడ్లో చేరునున్నాడు. ఏప్రిల్ 14న చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్కు పథిరన అందుబాటులో ఉండే అవకాశముంది. గత సీజన్ వరకూ చెన్నైకి ఆడిన పథిరన ఈసారి ఆ జట్టుతో ప్రత్యర్థిగా తలపడనున్నాడు.మూడింటా ఓటమి

పంతొమ్మిదో సీజన్లో కోల్కతా నైట్ రైడర్స్ను దురదృష్టం వెంటాడుతోంది. ఇప్పటిరకూ ఆడిన నాలుగు మ్యాచుల్లో ఒకటి రద్దవ్వగా.. మూడింటా ఓటమిపాలైన కేకేఆర్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ప్లే ఆఫ్స్ రేసుకు గట్టి పోటీ నెలకొన్న ఈ పరిస్థితుల్లో ఇకపై ప్రతి మ్యాచ్ను భారీ తేడాతో.. మంచి రన్రేటుతో గెలిస్తేనే అజింక్యా రహానే బృందం ముందంజ వేసే అవకాశముంది.

# నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే అసత్య ప్రచారం : మంగ్లీ

సినీ గాయని మంగ్లీ చుట్టూ ముసురుకున్న ఆర్థిక వివాదం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. మైక్రో ఫైనాన్స్ పేరుతో పది కోట్ల రూపాయల మేర మోసం చేశారంటూ న్యాయవాది సుబ్బారావు చేసిన ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. కేవలం తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఉద్దేశపూర్వకంగా ఈ అసత్య ప్రచారానికి తెరలేపారని మంగ్లీ మండిపడ్డారు. లాయర్ సుబ్బారావు తనపై ఫిర్యాదు చేయడానికి ముందే, తానే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశానని ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నోట్ల కట్టల దృశ్యాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఆ డబ్బు తనది కాదని ఆమె స్పష్టం చేశారు.

ఒక మహిళగా, కళాకారిణిగా సమాజంలో తనకున్న గుర్తింపును హననం చేసేలా జరుగుతున్న ఈ కుట్రపై చట్టపరంగా పోరాడతానని మంగ్లీ హెచ్చరించారు. తన వ్యక్తిగత మనోభావాలను దెబ్బతీస్తూ చేస్తున్న ఈ తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని ఆమె కోరారు. కాగా, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగ్లీ, ఆమె సోదరుడితో పాటు మరికొందరిపై న్యాయవాది సుబ్బారావు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వారి నుంచి ప్రాణహాని ఉందని ఆయన పేర్కొనడంతో పోలీసులు ఇప్పటికే బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొడుతూ మంగ్లీ ఎదురుదాడికి దిగడంతో ఈ వివాదం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



# రెట్రో లుక్‌లో కయాదు లోహర్ అదుర్స్!

## 'ది ప్యారడైజ్' నుంచి హీరోయిన్ ఫస్ట్ లుక్..

నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ సినిమా నుంచి చిత్ర బృందం ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను అందించింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కయాదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో కయాదు సరికొత్త రెట్రో లుక్‌లో ఆకట్టుకుంటున్నారు.

'దసరా' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్' పై ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే మేకర్స్ సినిమాను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన హీరోయిన్ ఫస్ట్ లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రానికి తమిళ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.



# స్టార్ హీరోకి జోడీగా సాహో బ్యూటీ!

బాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో విక్కీ కౌశల్. ప్రస్తుతం ఆయన అమర్ అశ్వత్థామ వంటి పౌరాణిక - చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే -మహావతార్- అనే భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించబోతున్నారు. ఈ సినిమాలో విక్కీ కౌశల్ సరసన నటించేందుకు శ్రద్ధా కపూర్‌తో చిత్ర బృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ప్రచారంతో అభిమానుల్లో సరికొత్త కాంబినేషన్ పై ఆసక్తి నెలకొంది. ఇప్పటి వరకూ విక్కీ కౌశల్ - శ్రద్ధా కపూర్ ఇంతవరకు వెండితెరపై కలిసి నటించలేదు. ఇద్దరూ తమదైన శైలిలో నటనను పండించగల ప్రతిభావంతులు. -సాహో- చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైన శ్రద్ధ గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేయడంలో దిట్ట. విక్కీ కౌశల్ పీరియాడిక్ లుక్స్‌లో పరకాయ ప్రవేశం చేస్తారనే పేరుంది.


ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే ఆ కెమిస్ట్రీ వెండితెరపై అద్భుతమైన మ్యాజిక్‌ను క్రియేట్ చేయడానికి అవకాశం ఉంది.

-మహావతార్- చిత్రం భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. ఇదొక చారిత్రక నేపథ్యం ఉన్న కథ కావడంతో పాత్రల ఎంపిక విషయంలో దర్శకుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

శ్రద్ధా కపూర్ తనదైన రాజసంతో ఈ చిత్రంలోని పాత్రకు పూర్తి న్యాయం చేస్తుందని భావించి ఆమెను సంప్ర దించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక చర్చలు ముగిశాయని త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల సమాచారం. సాధారణంగా పెద్ద సినిమాల్లో కొత్త కాంబినేషన్లు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రొటీన్ జంటల కంటే ఎప్పుడూ చూడని నటీనటులు కలిసి నటిస్తే ఆ సినిమాకు వచ్చే క్రేజ్ వేరుగా ఉంటుంది. విక్కీ కౌశల్ సీరియస్ పర్ఫార్మెన్స్‌కు శ్రద్ధా కపూర్ చరిష్మా తోడైతే అది సినిమాకు విజువల్ పరంగా , మార్కెట్ పరంగా ప్లస్ అవుతుంది. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే ఏడాది బాలీవుడ్ నుండి రాబోయే క్రేజీ చిత్రాలలో ఇదొకటిగా నిలుస్తుంది.



# ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'... స్ట్రీమింగ్ తేదీ ఖరారు



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో రూపొందిన భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా కావడంతో విడుదల సమయంలో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. కానీ, పవన్ కల్యాణ్ మార్క్ మేనరిజమ్స్, యాక్షన్ సీక్వెన్స్ అభిమానులను అలరించాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించగా... దేవి శ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించారు. ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. ఏప్రిల్ 16 నుంచి 'ఉస్తాద్ భగత్ సింగ్' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఏకకాలంలో స్ట్రీమింగ్ కానుండటం విశేషం. థియేటర్లలో ఈ సినిమాను వీక్షించే అవకాశం కోల్పోయిన పవన్ అభిమానులు, ఇప్పుడు పాన్-ఇండియా స్థాయిలో తమకు నచ్చిన భాషలో ఓటీటీలో చూసే వెసులుబాటు లభించింది. వెండితెరపై ఫలితం ఎలా ఉన్నా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో మాత్రం ఉస్తాద్ తన జోరు చూపిస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి.


## చెన్నైలో రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు



తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఇద్దరు అగ్ర నటుల ఇళ్లలో బాంబులు పెట్టినట్లు వచ్చిన సందేశం చెన్నై నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. తమిళనాడు డీజీపీ కార్యాలయానికి ఈరోజు అందిన ఒక బెదిరింపు ఈమెయిల్ పోలీసు యంత్రాంగానికి ముచ్చెమటలు పట్టించింది. పోయెస్ గార్డెన్‌లోని సూపర్ స్టార్ రజనీకాంత్ నివాసం, అల్వార్‌పేటలో ఉన్న హీరో ధనుష్ ఇళ్లలో బాంబులు అమర్చామని, అవి ఏ క్షణమైనా పేలవచ్చని ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. ఈ సమాచారం బయటకు రావడంతో ఒక్కసారిగా తమిళనాట అభిమానుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు వెంటనే బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి రంగంలోకి దిగారు. ఇద్దరు నటుల నివాసాల వద్దకు చేరుకున్న భద్రతా దళాలు సుమారు గంటన్నర పాటు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించాయి. ఇంటి లోపల, గార్డెన్ ప్రాంతం, పరిసరాల్లో అణువణువూ గాలించినా ఎక్కడా ఎటువంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభించలేదు. చివరకు అది ఒక 'ఫేక్ మెయిల్' అని అధికారులు నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే ఎవరో ఆకతాయిలు ఈ పనికి ఒడిగట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు.

# జయప్రద వారసుడి సినీ అరంగేట్రం

## : వెండితెరకు పరిచయం కానున్న సామ్రాట్



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న సీనియర్ నటి జయప్రద వారసుడు (సోదరుడి కుమారుడు) సామ్రాట్ ఇప్పుడు వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. గత కొంతకాలంగా సామ్రాట్ హీరోగా ఎంట్రీ ఇస్తారంటూ సాగుతున్న ప్రచారానికి ఇప్పుడు గ్రీన్ సిగ్నల్ లభించింది. సామ్రాట్‌ను టాలీవుడ్‌కు గ్రాండ్‌గా పరిచయం చేసేందుకు ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ సిద్ధమైంది. భారీ బడ్జెట్‌తో కూడిన పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు సామ్రాట్ నటన, డ్యాన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రత్యేక శిక్షణ పొంది అన్ని విధాలా సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు పాన్-ఇండియా గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో జయప్రద స్వయంగా రంగంలోకి దిగారు. సామ్రాట్ సరసన నటించేందుకు టాలీవుడ్‌లోని ఒక టాప్ హీరోయిన్ అయితేనే బాగుంటుందని ఆమె భావిస్తుండటంతో, ప్రస్తుతం చిత్ర యూనిట్ ఒక క్రేజీ హీరోయిన్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పరిశ్రమలోని ఇద్దరు ముగ్గురు అగ్ర తారలతో ప్రాథమిక చర్చలు జరిగినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం. కథా చర్చల నుంచి సాంకేతిక నిపుణుల ఎంపిక వరకు ప్రతి విషయంలోనూ జయప్రద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. జయప్రద వారసుడిగా సామ్రాట్ వెండితెరపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతారో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.